విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 సంచిక :116 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ సోమవారం 14 సెప్టెంబర్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# ఫలితాలు కనిపించాలి!


'బ్రిక్స్ పగ్గాలు చైనాకు.. ఇకపై ఫలితాలు చూపించాల్సిందే'

బ్రిక్స్ ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ

ఢిల్లీ డిక్లరేషన్‌ను కాలపరిమితితో అమలు చేయాలని బ్రిక్స్ దేశాలకు మోదీ సూచన

బ్రిక్స్ ఇక కేవలం దేశాల కూటమి కాదని, పరిష్కారాల వ్యవస్థ అన్న ప్రధాని






### రూల్స్ ఫాలో అవ్వడం కాదు.. సెట్ చెయ్యాలి

- వారి గళాన్ని వినిపిస్తున్నాం.. అందుకే బ్రిక్స్‌పై నమ్మకం
- బ్రిక్స్ కూటమిపై గ్లోబల్ సౌత్ దేశాలకు విశ్వాసం పెరిగిందన్న మోదీ

గ్లోబల్ సౌత్ దేశాలు ప్రపంచ సంక్షోభాల విషయంలో ముందు వరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే విషయంలో మాత్రం వెనుక వరుసలో ఉండిపోతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇకపై గ్లోబల్ సౌత్ నిబంధనలు పాటించేవిగానే ఉండకూడదని.. నియమాలు రూపొందించేవిగా ఎదగాలని ఆకాక్షించారు. భిన్నత్వమే బ్రిక్స్ దేశాల బలమని అన్నారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న బ్రిక్స్ వార్షిక సదస్సులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

## మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు

- భారత్‌పై దాడి చేయాలనే ఆలోచన వస్తే
- శత్రువుల వెన్నులో వణుకు పుట్టేలా ప్రధాని మోదీ చేశారు
- 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో ముందుంటుందనే విశ్వాసాన్ని మోదీ ప్రజలకు కలిగించారన్న షా
- మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చారని స్పష్టం
- డీకాలనైజేషన్ అంటే సత్యాన్ని ప్రామాణికంగా చూపడమేనని వ్యాఖ్య





## ఏపీకి 'అల్పపీడనం' ముప్పు

- అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి
- అత్యధికంగా 79.1, అత్యల్పంగా 32.5 మి.మీ వర్షపాతం నమోదవుతుంది
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది


పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు

వినాయక చవితి శుభాకాంక్షలు




వినాయక చవితి సందర్భంగా నేడు కార్యాలయానికి సెలవు. కావున రేపు (మంగళవారం) పత్రిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.


## దక్షిణాఫ్రికాతో ఆర్థిక బంధంపై ఫోకస్

- కీలక దేశాధినేతలతో మోదీ వరుస భేటీలు
- కజకిస్థాన్ అధ్యక్షుడు టోకయేవ్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు
- ఫిలిప్పీన్స్, ఉగాండా, దక్షిణాఫ్రికా, బురుండి నేతలతో కూడా భేటీలు
- వాణిజ్యం, వ్యూహాత్మక భాగస్వామ్యం, గ్లోబల్ సౌత్‌పై ప్రధానంగా చర్చలు





## పిడుగుపాటుతో నలుగురు మృతి..

- సీఎం చంద్రబాబు తీవ్ర విచారం
- పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు నలుగురు మృతి
- మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- ఉరుముల శబ్దానికి ఇద్దరు, పిడుగుపాటుకు మరో ఇద్దరు మృతి

## కేంద్ర పథకాల నిధులపై ప్రభుత్వం కసరత్తు

- రూ.25,304 కోట్లు మంజూరు
- రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సజావుగా అమలయ్యేందుకు ఒక్కో రూపాయిని ఎలా సేకరించవచ్చో ప్రభుత్వం కసరత్తు
- కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చే నిధులకు, రాష్ట్ర వాటాను జతచేసి పలు కార్యక్రమాలను అమలు
- కంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు రాబట్టడంతో పాటు అవి సకాలంలో ఖర్చుయ్యేలా సీఎం చంద్రబాబు ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లకు మార్గదర్శనం



అమరావతి

ఏపీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సజావుగా అమలయ్యేందుకు ఒక్కో రూపాయిని ఎలా సేకరించవచ్చో సర్కార్ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చే నిధులకు, రాష్ట్ర వాటాను జతచేసి పలు కార్యక్రమాలు అమలుచేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహి ళలు, శిశువులు, గర్భిణులకు ప్రయోజనం కల్పించే సంక్షేమ పథకాలతో పాటు పల్లెల్లో ప్రగతి పనులకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ఠంగా నిధులు రాబడుతోంది. 2026-2027 ఆర్థిక సంవత్సరంలో ఏపీలో 86 కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.25,304 కోట్లు మంజూరు చేయించు కోగలిగింది. ఈ మొత్తం 2024-2025లో వివరాలు 2లో..



## రాష్ట్రంలో లోక్ అదాలత్‌కు భారీ స్పందన

- ఒక్కరోజే 2.22 లక్షల కేసులు పరిష్కారం
- జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్
- శనివారం ఒక్క రోజే 2,22,770 పైగా కేసులు పరిష్కారమయ్యాయి
- రూ.212.49 కోట్లకు పైగా పరిహారం చెల్లింపునకు అవార్డులు జారీ

అమరావతి

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు భారీ స్పందన లభించింది. శనివారం ఒక్క రోజే 2,22,770 పైగా కేసులు పరిష్కారమయ్యాయి. రూ.212.49 కోట్లకు పైగా పరిహారం చెల్లింపునకు అవార్డులు జారీచేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వివరాలు 2లో..

## చైనా విషయంలో కేంద్రం వ్యూహాత్మకంగా లొంగిపోతోంది

- జిన్‌పింగ్‌తో మోదీ భేటీపై 4 ప్రశ్నలు సంధించిన కాంగ్రెస్
- మోదీ-జిన్‌పింగ్ భేటీ తర్వాత కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు
- గల్వాన్, అరుణాచల్ ప్రదేశ్‌పై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించిన కాంగ్రెస్
- చైనాతో రికార్డు స్థాయిలో పెరిగిన వాణిజ్య లోటుపై తీవ్ర ఆందోళన



# ఏపీకి ‘అల్పపీడనం’ ముప్పు

ఎల్‌నినో ప్రభావంతో ముఖం చాటేసిన వరుణుడు కరుణిస్తుండటంతో ప్రజలు, రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. శనివారం సాయంత్రం రాష్ట్రంలో అనేత ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో రహదారులు జలమయమయ్యాయి. మరోవైపు అల్పపీడన ప్రభావంతో ఇవాళ ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని, 24 గంటల్లో ఇది విదర్భ మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అల్పపీడన ప్రభావంతో నేడు(ఆదివారం) ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయని చెప్పింది. దక్షిణ కోస్తాలో ఓ మోస్తరు వానలు, రాయలసీమలో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కోనసీమ జిల్లా మలికిపురంలో అత్యధికంగా 79.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరులోని శారదా కాలనీలో 50.18 మిల్లీమీటర్లు, ఎన్టీఆర్ జిల్లా గుణదలలో 49, కృష్ణా జిల్లా నందమూరులో 38.5, పోలవరం జిల్లా కూనవరంలో 32.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది.

తిరుమలలో భారీ వర్షం: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న వేళ తిరుమలలో భారీ వర్షం కురిసింది. తిరుమల వ్యాప్తంగా రోడ్లపై నీరు ప్రవహించింది. ఇటీవల వరుణయాగం పూర్తిచేసుకున్న అనంతరం శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంటపాటు వర్షం కురవడంతో రోడ్లన్నీ నీటి ప్రవాహంతో కనిపించాయి. భక్తులు ఆలయ సమీపంలోని వాహన మండపం, రాంభగీచ ఎదురుగా ఉన్న షెడ్లలో తలదాచుకున్నారు. కొన్ని రోజులుగా ఎండవేడిమితో ఇబ్బంది పడుతున్న భక్తులు వర్షంతో ఉపశమనం పొందారు.

**కోనసీమలో జోరువాన**

అల్పపీడనం ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వర్షం దంచికొట్టింది. శనివారం జిల్లావ్యాప్తంగా సగటున 37.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంబాజీపేట ఆర్టీసీ బస్టాండ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆయుర్వేద వైద్యశాలల ముందు భారీగా వర్షపు నీరు నిలిచింది. అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం సమీపంలో అమలాపురం- రావుల పాలెం ప్రధాన



రహదారిపై చెట్టు కుప్పకూలింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు.

పొల్లూరు జలపాతం ప్రమాదకర స్థాయిలో: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. కొయ్యూరు, ముంచింగిపుట్టు, జీకే వీధి, పెదబయలు మండలాల్లో ఎడతెరిపిలేని వానలతో జనజీవనం స్తంభించింది. శనివారం కొయ్యూరులో 36.4 మిల్లీమీటర్లు, ముంచింగిపుట్టులో 28.6, జీకే వీధిలో 26.6, పెదబయలులో 19.4, చింతపల్లి 18.8, అరకులోయలో 12.2, పాడేరులో 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పొల్లూరు జలపాతం ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. జలపాతం వద్ద పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

**నీటిమునిగిన నిడదవోలు బస్టాండ్**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు బస్టాండ్ జలమయమైంది. చిన్నపాటి వర్షం కురిసినా బస్టాండ్‌లో నీరు నిలబడిపోతుంది. మురుగునీరుతో పాటు కలిసిపోయి ప్రాంగణంలో ప్రవహించడంతో ప్లాట్‌ఫామ్‌ల్లోకి చేరుకునేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే సమస్య వేధిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ఓసారి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కందుల దుర్గేష్ బస్టాండ్ నీట మునిగినప్పుడు పరిశీలించారు. సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించినా ఇప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్టాండ్‌లో వాన నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పోలీస్, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి విపత్తుల సంస్థ, ఆర్?టీజీఎస్ అందించే సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటేందుకు ప్రయత్నించవద్దన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో రాకపోకలను నిలిపివేయాలని హోంమంత్రి దిశానిర్దేశం చేశారు.

# నాగబాబుకు జోడు పదవుల రచ్చ..

**గుంటూరు :** జనసేన పార్టీ ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ (కేబినెట్ హోదా) కొణిదెల నాగబాబు చిక్కుల్లో పడ్డారా?. ఆయనకు జోడు పదవుల వివాదం తలనొప్పిగా మారబోతుందా?. సోషల్ మీడియా వేదికగా అదే చర్చ జరుగుతోంది.. జోడు పదవుల అంశం తెరపైకి వచ్చింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం జోడు పదవులు ఉండకూడదంటూ సోషల్ మీడియా వేదికగా కొత్త చర్చ మొదలైంది. గతంలో జయా బచ్చన్‌పై జోడు పదవులతో అనర్హత వేటు పడిందని.. ఎమ్మెల్సీగా ఉన్న నాగబాబుపై అనర్హత వేటు పడుతుందని కొందరు ట్వీట్‌లు చేశారు.ఏపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ నాగబాబును ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నియమించి కేబినెట్ హోదా కల్పించింది. ఆయన జీతభత్యాలు, అలవెన్సులకు సంబంధించి జీవోలో పేర్కొన్నారు. అయితే ఏదైనా ఉభయ సభల్లో సభ్యులుగా ఉన్నవారు ఇతర లాభదాయక పదవుల్లో ఉండకూడదని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందని ఓ నెటిజన్ ట్వీట్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఏ)ని గుర్తు చేశారు.. ఒక వ్యక్తి అటు కేంద్ర ప్రభుత్వంలో కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వంలో కానీ లాభదాయకమైన పదవిలో ఉంటే.. వారి రాష్ట్ర శాసనసభ లేదా శాసనమండలి సభ్యుడిగా పదవిలో కొనసాగడానికి అనర్హుడవుతారని రాజ్యాంగంలో స్పష్టం ఉందని పేర్కొన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తూ ఎమ్మెల్సీ నాగబాబుకు కేబినెట్ హోదా, నెలకు 3.80 లక్షల రూపాయల జీతభత్యాలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది నూటికి నూరు శాతం ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ (లాభదాయక పదవి) కిందకు వస్తుంది కాబట్టి ఎమ్మెల్సీ నాగబాబు మీద అనర్హత వేటు పడుతుందని చెప్పుకొచ్చారు. నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఉండగానే మళ్లీ ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి కేబినెట్ ర్యాంకుతో ఇవ్వడం, వేతనం పొందడం రాజ్యాంగ విరుద్ధమనేది కొందరి వాదన.. ఇదే అంశాన్ని ట్వీట్‌లో ప్రస్తావించారు.గతంలో జయాబచ్చన్‌పై ఇలాగే అనర్హత వేటు పడిందంటున్నారు. జయా బచ్చన్ గతంలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఉన్న సమయంలో.. మళ్లీ ఉత్తరప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. భారత రాజ్యాంగం ప్రకారం ఈ పదవి ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ (లాభదాయక పదవి) పరిధిలోకి వస్తుందని ఎన్నికల సంఘం పేర్కొంది. జయా బచ్చన్ రాజ్యసభ ఎంపీ పదవిపై మార్చి



2006లో అనర్హత వేటు పడింది. జయా బచ్చన్ మాత్రమే కాదు మరికొన్ని ఉదాహరణలు ఉన్నాయని చెబుతున్నారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఏ) ప్రకారం.. ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఉన్న వ్యక్తి ప్రభుత్వం నుంచి వేతనం, ప్రతిఫలం వచ్చే మరో లాభదాయక పదవి (ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్)లో ఉండకూడదు. ఒకవేళ లాభదాయక పదవిని చేపడితే ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ పదవిపై అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. ఈ రూల్‌నే ప్రధానంగా నాగబాబు విషయంలో ప్రస్తావిస్తున్నారు. అదే సమయంలో నాగబాబుపై అనర్హత వేటు పడకుండా ఏపీ ప్రభుత్వానికి మరో వెసులుబాటు కూడా ఉందనే వాదన వినిపిస్తోంది. ఇక్కడ మినహాయింపు చట్టాన్ని ప్రధానంగా గుర్తు చేస్తున్నారు. ఈ చట్టం ప్రకారం.. రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేకంగా చట్టం చేసి కొన్ని పదవులకు ఈ అనర్హత నుంచి మినహాయింపు ఇచ్చే అధికారం కూడా ఉందని కొందరు గుర్తు చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ వేతనాలు, పింఛన్ల చెల్లింపు అనర్హతల తొలగింపు చట్టం, 1953 ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కార్పొరేషన్లు, సొసైటీలు, కమిటీల ఛైర్మన్ పదవులను ఈ మినహాయింపు జాబితాలో చేరుస్తుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవిని.. అనర్హతల తొలగింపు చట్టం ప్రకారం.. మినహాయింపు పొందిన పదవిగా గుర్తించాల్సి ఉంటుంది. అప్పుడు న్యాయపరంగా ఎలాంటి చిక్కులు ఉండవనే మరో వాదన తెరపైకి వచ్చింది. రెండు పదవుల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు ఒక పదవికి మాత్రమే ఆర్థిక వేతనం తీసుకోవడం, రెండో పదవికి అలవెన్సులను కేవలం అధికారిక ఖర్చులకు మాత్రమే పరిమితం చేయొచ్చు. అప్పుడు లాభదాయక పదవి వివాదం రాకుండా చూడొచ్చు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాగబాబు పదవిని అనర్హతల తొలగింపు చట్టం పరిధిలోకి తీసుకొచ్చినా.. నిబంధనల ప్రకారం ఆర్థిక ప్రయోజనాల విషయంలో మార్పులు చేస్తే చట్టబద్ధమైన పదవిగా మారుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తావిస్తున్న అంశాలపై ఏపీ ప్రభుత్వం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# రేసులోకి వచ్చిన ఆనం

**నెల్లూరు :** నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రస్తుతం యాక్టివ్ పాలిటిక్స్‌లోనే ఉన్నారు. ఆయన రాజకీయ రిటైర్మెంట్ ప్రకటించలేదు. అయితే.. ఆయన రిటైర్ అవుతున్నారని.. ఆయన వారసుడు ఎవరు ? అంటూ.. రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ, కూటమి ప్రభుత్వంలో దేవాదాయ శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఆనం విషయం తరచుగా తెరమీదికి వస్తోంది. దెబ్బకు డిలీట్ ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొంటున్నారని చెబుతున్నారు. కానీ, ఆనం ఎక్కడా అసలు ఈ విషయం చెప్పలేదని అంటున్నారు. రిటైర్మెంట్ గురించిన వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమేనని అంటున్నారు. మంత్రిగా ఆయన ప్రస్తుతం ఆత్మకూరు పట్టణ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి పనుల్లో (రోడ్ల విస్తరణ, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి) పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉన్నారు. దీంతో ఇప్పుడు ఆనం యూటర్న్ తీసుకున్నారన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. మరో మూడేళ్ల తర్వాత.. పోటీకి రెడీ కాలేరన్న వాదన సహజం. అయితే.. ఆత్మకూరుతో తనకు ఉన్న బంధం నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోనూ పోటీకి రెడీ అవుతానంటూ.. తన అనుచరులకు చెపుతున్నారట. కాబట్టి ప్రస్తుతానికి ఆత్మకూరు బరిలో వేరే వారు వస్తారనే ప్రశ్నే లేదు; ఆయనే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనే పోటీ చేయనున్నారు.. అని అంటున్నారు.టీడీపీ ఆలోచన మరో విధంగా ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఆనం.. టీడీపీ తరఫున ఆత్మకూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే.. వచ్చే ఎన్నికల నాటికి యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ నిర్ణ యించింది. ప్రధానంగా.. నారా లోకేష్ నాయకత్వాన్ని పెంచే దిశగా సమాలోచనలు చేస్తున్న దరిమిలా.. వృద్ధ నేతలను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆనంను నామినేటెడ్‌పదవికి షిఫ్టు చేసి.. ఆత్మకూరును వేరే వారికి ఇచ్చే ఆలోచనలో ఉన్నారన్నది స్థానికంగా జరుగుతున్న చర్చ. కానీ, ఆనం మాత్రం.. ఈ విషయాలు వెలుగు చూస్తున్న క్రమంలో మరింత యాక్టివ్ అవుతుండడం గమనార్హం.

## కేంద్ర పథకాల నిధులపై ఏపీ ప్రభుత్వం కసరత్తు

-మొదటిపేజీ తరువాయి

14,109 కోట్లు, 2025-2026లో రూ.15,126 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు రాబట్టడంతో పాటు అవి సకాలంలో ఖర్చయ్యేలా సీఎం చంద్రబాబు ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లకు మార్గదర్శనం చేస్తున్నారు. ఈ ఏడాది నాలుగో విడత నిధులు కేంద్రం నుంచి మంజూరు కావాల్సి ఉంది. ఆ మొత్తం కూడా సమకూరితే గత రెండు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మొత్తానికి సమానంగా ఈ ఒక్క ఏడాదిలోనే సాధించినట్లు అవుతుంది. 2024-2025, 2025-2026 ఆర్థిక సంవత్సరాల్లో ఉమ్మడి పథకాలకు కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి రూ.38,115 కోట్లు వెచ్చించారు. తద్వారా రెండు కోట్ల మందికి లబ్ధి చేకూరింది.

ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో ఏపీకి కేంద్ర పథకాల కింద తొలి విడతలో వచ్చిన రూ.8694 కోట్లు ఇప్పటికే వెచ్చించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10,552 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమ కాగా, వాటికి రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపి మొత్తం రూ.18,516 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. మొత్తం 23 ప్రభుత్వ శాఖల్లో ఆరింటికి కేంద్రం ఈ సంవత్సరం రూ.1000 కోట్లకు మించి మంజూరు చేసింది. ఒక్క పంచాయతీరాజ్ శాఖకే రూ.11,184 కోట్లు మంజూరుకాగా, ఇప్పటికే రూ.4461 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమయ్యాయి. గృహనిర్మాణ శాఖకు రూ.2500 కోట్లు, ప్రాథమికోన్నత విద్యకు రూ.2351 కోట్లు, వైద్యారోగ్యశాఖకు రూ.2232 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమానికి రూ.1398 కోట్లు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు రూ.1210 కోట్ల చొప్పున మంజూరయ్యాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేలా కేంద్రం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ కింద వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో కేవలం రూ.2255 కోట్లు మాత్రమే వెచ్చించింది. ఈ పథకం గడువు ముగిసేలోగా ఏపీలోని 95.44 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యం నెరవేరలేదు. ఎన్డీయే సర్కార్ ఏర్పడ్డాక కేంద్రంతో చర్చించి, పథకం గడువు పొడిగింపజేయడంతో పాటు నిధుల సాధనపై దృష్టి పెట్టింది. ఈ సంవత్సరం కేంద్రం రూ.2631 కోట్లు కేటాయించింది.

పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించే పోషణ్ 2.0 పథకంలో ఏపీకి రూ.971 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 20 లక్షల మందికిపైగా లబ్ధి కలగనుంది.

## రాష్ట్రంలో లోక్ అదాలత్‌కు భారీ స్పందన



-మొదటిపేజీ తరువాయి

జస్టిస్ లిసా గిల్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, హైకోర్టు న్యాయసేవల కమిటీ ఛైర్మన్ జస్టిస్ బట్టు దేవానంద్ మార్గదర్శకాల్లో రాష్ట్రంలోని దిగువ న్యాయస్థానాల్లో శనివారం 441 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. శనివారం సాయంత్రానికి రాజీకి అవకాశమున్న 2,22,770 కేసులను ఇరువర్గాల మధ్య సామరస్యపూర్వకంగా పరిష్కరించారు.

హైకోర్టు ప్రాంగణంలో ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో మొత్తం నాలుగు లోక్ అదాలత్ బెంచ్‌లను నిర్వహించారు. జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ ఆలపాటి గిరిధర్, జస్టిస్ చింతలపూడి పురుషోత్తంకుమార్‌లు ఆయా బెంచ్‌లకు అధ్యక్షత వహించారు. 76 కేసులను పరిష్కరించారు. రూ.1.26 కోట్ల పరిహారం అందజేసేందుకు అవార్డులు జారీచేశారు. అలాగే విశాఖపట్నంలోని రుణ వసూళ్ల ట్రైబ్యునల్(డీఆర్టీ) బెంచ్‌లో 13 కేసులను పరిష్కరించి రూ.46.11 కోట్ల పరిహార చెల్లింపునకు అవార్డులు జారీచేశారు.

**సామరస్యపూర్వకంగా పరిష్కరించడం**

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గురజాల కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 43 ఏళ్లనాటి 71.51 ఎకరాల భూసేకరణకు సంబంధించిన అప్పీళ్లను సామరస్యపూర్వకంగా పరిష్కరించడం విశేషం. సుదీర్ఘ కాలం కొనసాగిన భూసేకరణ వివాదానికి పరస్పర అంగీకారంతో తెరపడింది. దీంతో భూములిచ్చిన రైతులకు ఉపశమనం లభించింది. మాచర్ల మండలం, కొత్తపల్లి గ్రామంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం 1983లో 71.51 ఎకరాలు సేకరించారు.

ఈ వ్యవహారమై గురజాలలోని పదో అదనపు జిల్లా కోర్టులో 24 అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఈ అప్పీళ్లను ఇరుపక్షాల మధ్య సామరస్యపూర్వకంగా పరిష్కరించారు. ఈ కేసులను పరిష్కరించుకోవడానికి ముందుకొచ్చిన రైతులు, పరిష్కార కార్యక్రమంలో పాల్గొన్న న్యాయాధికారులను గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి(పీడీజే) బి.సాయి కల్యాణ చక్రవర్తి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభినందించారు.

**గుంటూరు జిల్లా న్యాయశాఖ మరో రికార్డు**

రాష్ట్రస్థాయిలో సివిల్ కేసుల పరిష్కారంలో ఉమ్మడి గుంటూరు జిల్లా న్యాయశాఖ మరోసారి రికార్డు సృష్టించింది. జాతీయ లోక్ అదాలత్‌లో వరుసగా ఆరోసారి మొదటిస్థానాన్ని కైవసం చేసుకుంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి కృషితో ఇది సాధ్యమైంది. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 1,041 సివిల్ కేసుల పరిష్కారంతో ఉమ్మడి గుంటూరు జిల్లా తొలిస్థానంలో, 489 కేసుల పరిష్కారంతో తూర్పుగోదావరి జిల్లా రెండో స్థానంలో, 446 కేసుల పరిష్కారంతో కృష్ణాజిల్లా మూడోస్థానంలో నిలిచాయి.

## పిడుగుపాటుతో నలుగురు మృతి..

పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు గురై నలుగురు వ్యక్తులు మరణించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పండుగపూట నాలుగు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొనడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారిని ఆదుకుంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

**అసలేం జరిగింది?**

పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఈ ప్రకృతి బీభత్సంలో పిడుగులు పడి వేర్వేరు గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**మృతుల వివరాలు..**

నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన తలపనేని నాగమ్మ (63) ఇంటి సమీపంలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. ఆ తీవ్రమైన శబ్దానికి భయపడి గుండెపోటుకు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అదేవిధంగా, కాకాని శివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేకల వెంకాయమ్మ (60) కూడా తన ఇంటి వద్ద పిడుగు పడిన భారీ శబ్దానికి గుండె ఆగి మరణించారు. మరో రెండు ఘటనల్లో, పాలపాడు గ్రామానికి చెందిన రైతు దేరంగుల వెంకటయ్య, యాకలవారిపాలెంకు చెందిన మరో రైతు మజ్జిగ చిన్న కోటేశ్వరరావు పిడుగుపాటుకు నేరుగా గురై ప్రాణాలు విడిచారు. పొలాల్లో పనుల్లో ఉన్న సమయంలో ఈ దుర్ఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ పిడుగుల కారణంగా రెండు వేర్వేరు గ్రామాల్లో మూడు ఆటోలు, పలు కొబ్బరి, మామిడి చెట్లు కూడా దెబ్బతిన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ.

**మట్టి గణపతులనే పూజించాలని ప్రజలకు పిలుపు.**

**పర్యావరణ పరి రక్షణ అందరి బాధ్యత యార్లగడ్డ.**



**గన్నవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 13:** వినాయక చవితి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలతో పాటు గన్నవరం నియోజకవర్గ ప్రజలందరికీ ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శుభాకాంక్షలు తెలిపారు. ఏ శుభకార్యాని కైనా తొలి పూజ విఘ్నేశ్వరుడికే చేయడం భారతీయ సంప్రదాయమని పేర్కొన్నారు. మహా గణాధిపతి అనుగ్రహంతో ప్రజలందరి కోరికలు నెరవేరాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరి రక్షణ అందరి బాధ్యత అని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టితో తయారు చేసిన సహజ వినాయక విగ్రహాలనే పూజించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి గణపతులను పూజిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తున్న వారందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## సిల్క్ సిటీ... గ్రీన్ సిటీగా, కాలుష్యరహిత సిటీగా ఉండాలి.

- పట్టణ ప్రజలకు ధర్మవరం తెదేపా ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ పిలుపు.
- ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ.
- ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని శ్రీరామ్ విజ్ఞప్తి.





**ధర్మవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 13:** సిల్క్ సిటీ గా ఉన్న ధర్మవరం పట్టణం గ్రీన్ సిటీగా మారాలని, అలాగే కాలుష్య రహిత పట్టణంగా ఉండాలని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ఆకాంక్షించారు. ధర్మవరం పట్టణం లోని ఎర్రగుంట సర్కిల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి విగ్రహాలను అందజేశారు. పర్యావరణ పరి రక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఆర్యవైశ్య యువజన సంఘాన్ని శ్రీరామ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన ధర్మవరం పట్టణానికి మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున వస్తుంటారని, ఇలాంటి సమయంలో మన ప్రాంతం పరిశు భ్రంగా కాలుష్యరహితంగా ఉండాలన్నారు. అలాగే పెద్ద ఎత్తున మొక్కలు పెంచి గ్రీన్ ధర్మవరంగా మారాలని కోరుకున్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడకుండా మట్టి విగ్రహాలను పూజించాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్యరహిత సమాజం, పర్యావరణ పరి రక్షణ కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు.

## రుమల బ్రహ్మోత్సవాలు: ఆరు రోజుల పాటు ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ నిలిపివేత

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతిలో జారీ చేసే సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లను సోమవారం నుంచి ఆరు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 19వ తేదీ వరకు భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుని క్యూలైన్లలో చేరాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తిరిగి ఈనెల 20న.. 21వ తేదీ దర్శనం కోసం టోకెన్లను జారీ చేయనుంది.అయితే, సోమవారం నాటి టోకెన్ల కోసం ఆదివారం ఉదయం నుంచే తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్‌ల వద్ద భక్తులు బారులు తీరారు. టోకెన్ల నిలిపివేతపై తమకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఆవేదన, నిరాశ వ్యక్తం చేశారు. అనంతరం వారంతా తిరుమలకు ప్రయాణమయ్యారు. వరుస సెలవులు కూడా తోడవడంతో తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది.

# పారిశ్రామిక విప్లవం కోసం ముఖ్యమంత్రి కృషి





- ఇంటికొక పారిశ్రామికవేత్త లక్ష్యం.
- పరిశ్రమల ఏర్పాటుకు 24 లక్షల కోట్ల పెట్టుబడులు.
- ఎంఎస్ ఎం ఈ ద్వారా ప్రోత్సాహకాలు.
- ఏపీ చాంబర్ ఎక్స్ పో ను సందర్శించిన
- మంత్రులు అనిత, కొండపల్లి.

**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 13:**
ఆంధ్ర రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారని
రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. విశాఖపట్నం గాదిరాజు ప్యాలెస్ లో ఏపీ చాంబర్ 2026 ఆధ్వర్యంలో జరుగుతున్న ఎక్స్ పో కార్యక్రమాన్ని హోమ్ శాఖ మాత్యులు వంగలపూడి అనిత, ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు మాధవ్ తో కలిసి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. ఎక్స్ పో లో ఏర్పాటు చేసిన పలు విభాగాలను, దుకాణాలను పరిశీలన చేశారు. అనంతరం జరిగిన సభ సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర లోని తొలి సారిగా ఏపీ చాంబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎక్స్ పో కి అద్భుత మైన స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో పారిశ్రామిక వేత్తలను చైతన్యపరిచేందుకు ఎక్స్ పో నిర్వహణ చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎంఎస్ఎంఈ ద్వారా నిర్వహించే ఎక్స్ పోలకు తప్పనిసరిగా మంత్రులు హాజరు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచిస్తున్నారన్నారు. రెండు సంవత్సరాల కాలం లోనే కూటమి ప్రభుత్వంలో పరిశ్రమల ఏర్పాటు కోసం 24 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయన్నారు. 175 నియోజకవర్గాలలో 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయనున్నామని, అందులో 19 పార్కులు ఇప్పటికే ప్రారంభించడం జరిగిందని, 138 పార్కులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఇప్పటికే ఈ పార్కుల ద్వారా 2876 యూనిట్లను నూతనంగా ప్రారంభించడం జరిగిందన్నారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు ఎం ఎస్ ఎం ఈ ద్వారా ఉద్యోగాలు కల్పించాలనే కృత నిచ్చయంతో ఉన్నారన్నారు. ప్రతి ఇంటి నుండి ఒక పారిశ్రామిక వేత్తను ఏర్పాటు చేయడం, వ్యాపారం చేయడం ద్వారానే ఆర్థిక స్వావలంబన జరుగుతుందనే సంకల్పంతో ఎం ఎస్ ఎం ఈ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎనర్జీ అఫీషియన్స్ ద్వారా పార్కులకు ఒప్పందం చేయటం జరుగుతుందని, ప్రభుత్వ పోర్టల్ ద్వారా బ్యాంకు లోన్లకు సంబంధించి ఇబ్బందులను సైతం బ్యాంకర్లతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి కొండపల్లి తెలిపారు. ఎన్ ఆర్ డి సి ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్, మ్యానుఫ్యాక్చరర్స్, ఇతర యూనిట్ల వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఐ పి ఓ ల ద్వారా మంచి ఐడియాలు ఎవరు ఇచ్చినా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎం ఎస్ ఎం ఈ పార్కులలో చేసిన తయారీ వస్తువుల అమ్మకాల కోసం సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయటానికి మెటా ద్వారా ఒప్పందం చేసుకున్నామని ఇది కంపెనీల వారికి సువర్ణ అవకాశమన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఎం ఎస్ ఎం ఈ పార్కుల ద్వారా తయారుచేసిన వస్తువులను ప్రపంచంలో మార్కెట్ చేయడం కోసం ఫ్లిప్కార్ట్, అమెజాన్ గ్లోబల్ సంస్థలతో ఒప్పంద నిర్వహణ కార్యరూపం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నుంచి ఎం ఎస్ ఎం ఈ ల పార్కుల కోసం అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ జిడిపి పెంచాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నారని మంత్రి కొండపల్లి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే ఉత్తరాంధ్రలో అనేక పరిశ్రమలు వచ్చాయని వివరించారు. అలాగే పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందాలంటే రవాణా రంగం కూడా అభివృద్ధి చెందాలని అందులో భాగంగానే ప్రతి 150 కిలో మీటర్లకు ఒక పోర్టు, ప్రతి 200 కిలో మీటర్లకు ఒక విమానాశ్రయం, ప్రతి 50 కిలో మీటర్లకు ఒక హెలిపాడ్ నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి కొండపల్లి తెలిపారు. ఏపీ చాంబర్ వారి ద్వారా పరిశ్రమలు అభివృద్ధి చెందటానికి నూతన పాలసీ తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ వైపు ప్రపంచం లోని పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడం కోసం వస్తున్నారని అది ఎంతో గర్వంగా ఉందని మంత్రి కొండపల్లి పేర్కొన్నారు.
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ వైజాగ్ లో నిర్వహిస్తున్న ఎక్స్ పో కి మహిళా పారిశ్రామిక వేత్తలు సైతం రావడం సంతోషాన్ని కలిగ చేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాంతాలవారీగా క్లస్టర్ డెవలప్మెంట్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందులో భాగంగానే వైజాగ్ ఫ్రూట్స్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ, పలాసలో జీడీ గింజల పరిశ్రమలను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చిత్తూరులో మామిడి సంక్షోభం ఎదుర్కొంటున్న రైతన్నల కోసం సోలార్ ద్వారా మామిడి పొడి చేయటానికి ప్రభుత్వం ప్రోత్సహించిందన్నారు. అలాగే అనంతపురం ప్రాంతంలో అరటికాయల పొడి చేయటం కోసం, మచిలీపట్నం వన్ గ్రామ్ గోల్డ్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని ఆయన తెలిపారు. మన ప్రాంత ఖ్యాతిని కలగజేసే టాయ్స్ పార్కును ఏపీ చాంబర్స్ ద్వారా కృషి చేయాలన్నారు. అలాగే ఏపీ చాంబర్స్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఉన్న పరిశ్రమలను రక్షించడంతోపాటు కొత్త పరిశ్రమలను సృష్టించాలని, పాత పరిశ్రమలను ఏ విధంగా సంరక్షించాలో కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ వైజాగ్ మహానగరంలో ఎక్స్ పో లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో పది ఎకరాల స్థల సేకరణ చేయడంతో పాటు ఎక్స్పో, ఎగ్జిబిషన్లకు అనుకూలంగా నిర్మాణం చేపట్టాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ లను కోరారు.
కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో తొలిసారి నిర్వహించిన ఎక్స్ పో విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రతిపాదనకు పారిశ్రామికవేత్తలు కలిసి రావటం సంతోషం కలిగించిందని అక్టోబర్ 7 వ తారీఖు నిర్వహించే ఎం ఎస్ ఎం ఈ సమ్మిట్ ను కూడా విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ డిప్యూటీ చైర్ పర్సన్ కోరాటి రోష్ని అపరంజి, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పొట్లూరి భాస్కర రావు, జోన్ చైర్మన్ శోభన్ ప్రకాష్, వైస్ చైర్మన్ ఎం బి పవన్ కార్తీక్, జి శివకుమార్, శ్రీవల్లి, రావి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు





## ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు.

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన పరిటాల శ్రీరామ్.
- 87 మందికి రూ.44 లక్షల చెక్కులు అందజేత.
- ప్రమాదంలో మరణించిన కార్యకర్త కుటుంబానికి 5 లక్షల ఇన్సూరెన్స్ అందజేత.
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు మనమంతా రుణపడి ఉన్నాము శ్రీరామ్.







ధర్మవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 13:
ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నారని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం టిడిపి కార్యాలయంలో ఆయన ఆదివారం రోజు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 87 మందికి 44 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల, వార్డుల నాయకులు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు పరిటాల శ్రీరామ్ కు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ధర్మవరం పట్టణంలో శాంతినగర్ కు చెందిన టిడిపి కార్యకర్త నెట్టెం కేశవ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్... కేశవ్ కు పార్టీ సభ్యత్వం ఉండటంతో ఇన్సూరెన్స్ వచ్చేలా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరామ్ చొరవతో 5 లక్షల రూపాయల ప్రమాద బీమా పత్రం పార్టీ కార్యాలయం నుంచి వచ్చింది. ఈ నేపథ్యంలో కేశవ సతీమణి నెట్టెం మహేశ్వరికి ఈ బీమా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో పాటు వారి కష్టాల విషయంలో ముఖ్యమంత్రి స్పందిస్తున్న తీరు చాలా గొప్పగా ఉందని అన్నారు. ఎంతో మందికి ఇప్పటికే సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేసినట్లు చెప్పారు. ధర్మవరం నియోజకవర్గం లోనే ఈ 26 నెలల్లో 3 కోట్లకు పైగా సాయం చేసినట్లు వివరించారు. గతంలో ఎప్పుడు ఇలాంటి సాయం అందలేదన్నారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ఏ కష్టం ఉందన్నా... ముఖ్యమంత్రి వెంటనే స్పందిస్తున్నారన్నారు. మరో వైపు కార్యకర్తల కుటుంబానికి ఏం జరిగినా నేనున్నానంటూ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ స్పందిస్తున్నారన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనివిధంగా కేవలం వంద రూపాయల సభ్యత్వంతో ఐదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ వచ్చేలా చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఎంతో మంది కార్యకర్తలు కుటుంబానికి ఈ సాయం అందిందన్నారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా ఉండటానికి ప్రతి ఒక్కరు గర్వపడుతున్నారని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పని చేస్తున్నందుకు తమకు ఎంతో సంతృప్తిగా ఉందని పరిటాల శ్రీరామ్ అన్నారు.

# కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయ సాధనకు పునరంకితం అవుదాం..

### సిఐటియు నాయకులు గనిశెట్టి.




**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 13:** భారత కమ్యూనిస్టు ఉద్యమ ధ్రువతార, మార్క్సిస్టు మేధావి, సిపిఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లౌకికవాదం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ ద్వారా తన పోరాట ప్రస్థానాన్ని ప్రారంభించిన సీతారాం ఏచూరి, జాతీయ రాజకీయాల్లో అత్యున్నత స్థాయికి ఎదిగారని అన్నారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన సాగించిన పోరాటాలు, నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని సైతం నిలదీసిన తీరు నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ప్రజా సమస్యల పై లోతైన అవగాహనతో, సిద్ధాంత నిబద్ధతతో జీవితాంతం ప్రజల పక్షాన నిలిచారని తెలిపారు. యూపీఏ-1 ప్రభుత్వ కాలంలో గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే గ్రామీణ ఉపాధి హామీ పథకం, గిరిజనుల హక్కుల పరి రక్షణకు సంబంధించిన చట్టాలు, సమాచార హక్కు చట్టం వంటి ప్రజలకు ఉపయోగపడే కీలక చట్టాల రూపకల్పన, సాధనలో ఏచూరి ముఖ్య మైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్లమెంటరీ వేదికను ప్రజల హక్కుల కోసం సమర్థవంతంగా వినియోగించి కార్మికులు, కర్షకులు, పేదలు, గిరిజనుల సమస్యలను బలంగా వినిపించారని అన్నారు. దేశంలో మతోన్మాద, కార్పొరేట్ శక్తుల పెరుగుతున్న ఆధిపత్యానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులను ఐక్యం చేయడంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల పరి రక్షణ కోసం ఆయన చివరి వరకు పోరాడారని అన్నారు. మతోన్మాదాన్ని పెంచుతూ ప్రజల మధ్య విభజనలు సృష్టించే శక్తులకు, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలకు వ్యతిరేకంగా ఏచూరి బలమైన పోరాటం సాగించారని పేర్కొన్నారు. విద్యారంగంలో సమాన అవకాశాలు, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య విలువల కోసం ఏచూరి నిరంతరం కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విద్యను ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ నుంచి కాపాడాలని ఆయన పోరాడారని అన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలు సామాన్య విద్యార్థుల పై భారాన్ని పెంచుతున్నాయని, పరీక్షా పత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కుల పరి రక్షణ కోసం పోరాటాలను బలోపేతం చేయాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. మతోన్మాదాన్ని ఓడించి లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడటంతో పాటు కార్మికులు, కర్షకులు, పేదలు, విద్యార్థులు, యువత, మహిళల హక్కుల కోసం ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాల సాధన కోసం, సమ సమాజ స్థాపన లక్ష్యంతో వామపక్ష కార్యకర్తలు పునరంకితం కావడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జి శ్రీను, బి అప్పారావు, సిహెచ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భగీరథి మాతకు 101 బిందెలతో జలాభిషేకం.

### వరుణ దేవుని కరుణ కోసం మహిళల ప్రత్యేక ప్రార్థన.





అచ్యుతాపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 13: :సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గ్రామ మహిళలు భగీరథి మాతకు 101 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు.
అమ్మవారి కృపతో వరుణ దేవుడు అనుగ్రహించి సమృద్ధిగా వర్షాలు కురిసి, చెరువులు, కాలువలు, బావులు నీటితో నిండి పాడిపంటలు సస్యశ్యామలంగా వర్ధిల్లాలని మహిళలు సామూహికంగా ప్రార్థించారు. భగీరథి మాత కరుణతో వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు కోరుకున్నారు.


## మట్టి వినాయకులను పంపిణీ..





**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 13:**జీవీఎంసీ 84 వార్డ్ అనకాపల్లి పట్టణం కోట్నీ వీధిలో ఆదివారం 84 వ వార్డు వైయస్సార్ సిపి ఇన్చార్జ్ కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో పర్యావరణ పరి రక్షిద్దాం కొరకు వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర రావు, కేతిరెడ్డి ప్రసాద్, మొల్లి శ్రీను, కరణం సురేష్, కరణం సత్తిబాబు, ఎస్ కనకారావు, పెంటారావ్, దిమ్మిలి సత్తిబాబు, ఇల్లప్ప గణేష్, కోల్లిమెల్ల కుమారి, సేనాపతి సాయి, కృష్ణ, నాగు, కాశి, ప్రసాదు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన ఒడిమెట్ట లక్ష్మీ గణపతి ఆలయం

### భారీ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ



**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 13:** నక్కపల్లి మండలం, ఒడిమెట్టలో స్వయంభూ వినాయకుడిగా వెలసిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వినాయక చవితి నుండి తొమ్మిది రోజులు పాటు గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ప్రత్యేక స్వామివారిని దర్శించుకునేందుకు నక్కపల్లి,ఎస్ రాయవరం, ఎలమంచిలి, పాయకరావుపేట, తుని,అన్నవరం తదితర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి సోమవారం దర్శించుకుంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయం వద్ద బారికేడ్లు క్యూ లైన్ లో ఏర్పాటు చేశారు. జాతీయ రహదాన్ని అనుకొని ఉన్న స్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల తోరణాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో వినాయక స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పైలా వరాహ నూకన్న నాయుడు తెలిపారు. ఉదయం
6:30 గంటలకు స్వామివారి గిరిప్రదక్షిణ ఏర్పాటు చేశారు. వినాయక చవితి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా నక్కపల్లి సిఐ జె. మురళి, ఎస్ ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



## కమ్మాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ.







**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 13:** పట్టణం లోని రామచంద్ర థియేటర్ వద్ద పెట్రోల్ బంక్ ఎదురుగా అనకాపల్లి కమ్మ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఆదివారం నాడు పర్యావరణ పరి రక్షణ కోసం సామాజిక బాధ్యతగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వినాయక చవితి పండగ సందర్భంగా 1,500 కు పైగా మట్టి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా అందించడం జరిగింది. రసాయనాలతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల మన నీటి వనరులు, జలచరాలు తీవ్రంగా దెబ్బతింటున్న ఈ రోజుల్లో, ఇటువంటి పర్యావరణహిత (ఇకో ఫ్రెండ్లీ) కార్యక్రమాలు ఎంతో అవసరం అని అసోసియేషన్ సభ్యులు అన్నారు.
మన ఆచార వ్యవహారాలను, పండుగలను ప్రకృతికి హాని కలగకుండా జరుపుకోవచ్చని నిరూపిస్తూ, ప్రజలలో చైతన్యం నింపిన ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లిన అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఓ. రాఘవరావు కి, అధ్యక్షులు కె. రమేష్ బాబు కి, ప్రధాన కార్యదర్శి కొల్లి శ్రీనివాస్ కి, సభ్యులందరికీ ప్రజలు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిధులు మాట్లాడుతూ
ఇటువంటి మంచి కార్యక్రమాలు మరిన్ని జరిగి రాబోయే వినాయక చవితి పండుగ ప్రతి ఇంట పర్యావరణహితంగా, భక్తి శ్రద్ధలతో వేడుకగా జరగాలని కోరుకుంటున్నాం అని తెలియజేశారు

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

### త్వరలోనే ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం చూపిస్తాం వంశీ కృష్ణ.





**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 13:**జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్, ఆరోగ్య భద్రత తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని తెలిపారు.
ఆశీల్‌మెట్ట లోని వేమన మందిరంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 700 మంది పాత్రికేయులకు మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్ప పుస్తకాలు,
పూలు, పండ్ల మొక్కలు, స్వీట్లు పంపిణీ చేశారు. పర్యావరణ పరి రక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గౌరవ అతిథి చెల్లుబోయిన నర్సింగరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సేవలు అభినందనీయమని, వారి సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, నగరం లోని వివిధ మీడియా సంస్థల పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి ఉపమాక వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లు పూర్తి





నక్కపల్లి, పెన్ సత్తా,సెప్టెంబర్ 13:నక్కపల్లి మండలంలో ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ అధికారులు ఆదివారం వెల్లడించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం బయట టెంట్లు, ఆలయం లోపల పెండాల్స్ ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా 15వ తేదీన ధ్వజారోహణం, 20న వసంతోత్సవం, 21న తిరువీధి సేవ, 22న మృగవే, 23న మహాపూర్ణాహుతి, వినోద ఉత్సవం, చక్రవారి స్నానం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అధికారులు తెలిపారు. పది రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు భాగస్వామ్యం కావాలని, స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు కోరారు.

### సంచలనం : లాడెన్ టార్గెట్ హిట్ లిస్ట్ లో

## భారత్.. సీఐఏ పత్రాలు లీక్

ప్రపంచాన్ని కుదిపేసిన 9/11 దాడులకు మూడేళ్ల ముందే ఉగ్రవాద ముప్పుపై ప్రమాద ఘంటికలు మోగాయా? ఒసామా బిన్ లాడెన్ నేతృత్వంలోని అల్‌ఖైదా నెట్‌వర్క్ అమెరికాను మాత్రమే కాకుండా భారత్ సహా అనేక దేశాలను టార్గెట్‌గా పరిశీలించిందా? తాజాగా వెలుగులోకి వచ్చిన అమెరికా నిఘా పత్రాలు ఇప్పుడు ఈ ప్రశ్నలను తెరపైకి తెచ్చాయి. ఇప్పటివరకు ఒసామా బిన్ లాడెన్ పేరు వినగానే ప్రధానంగా అమెరికాపై జరిగిన 9/11 దాడులే గుర్తుకొస్తాయి. కానీ అతడి వ్యూహం ఒక్క అమెరికాకే పరిమితం కాలేదని.. 1990ల చివరి నాటికే అనేక దేశాలను లక్ష్యంగా చేసుకునే స్థాయిలో అల్‌ఖైదా తన నెట్‌వర్క్‌ను విస్తరించిందని అమెరికా సీఐఏ పత్రాలు సూచిస్తున్నాయి. ఇందులో భారత్ పేరు ఉండటమే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**1998లోనే భారత్ పేరు**

1998 ఆగస్టు 28 నాటి 'బిన్ లాడెన్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్ స్టిల్ ఎ థ్రెట్' పేరుతో రూపొందించిన ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్‌లో భారత్ ప్రస్తావన కనిపించింది. బిన్ లాడెన్ నెట్‌వర్క్ భారత్‌తో పాటు పాకిస్థాన్, ఈజిప్ట్, కువైట్, సౌదీ అరేబియా, యెమెన్, ఉగాండా, నైజీరియా వంటి దేశాల్లో దాడుల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అయితే ఇక్కడ ఒక విషయం కీలకం. భారత్‌లో ఏ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నారు? ఏ తేదీన దాడి చేయాలని భావించారు? ఏ తరహా ఆపరేషన్‌కు ప్లాన్ చేశారు? వంటి నిర్దిష్ట వివరాలు మాత్రం అందుబాటులోకి వచ్చిన పత్రాల్లో లేవు. అందువల్ల భారత్‌పై ఒక నిర్దిష్ట దాడి ప్రణాళిక సిద్ధమైందని చెప్పడం కంటే అల్‌ఖైదా లక్ష్యాల పరిధిలో భారత్ కూడా ఉన్నట్లు నిఘా సమాచారం సూచించింది.

**అసలు షాకింగ్ విషయం 'హిట్ లిస్ట్' మాత్రమే కాదు**

ఈ పత్రాల్లో భారత్ పేరు కనిపించడం ఒక కోణమైతే.. అంతకంటే ఆందోళన కలిగించే అంశం అప్పటికే అల్‌ఖైదా ఎంత విస్తృతమైన నెట్‌వర్క్‌ను నిర్మించుకుందన్నదే. అఫ్ఘానిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై అమెరికా క్షిపణి దాడులు చేసినప్పటికీ బిన్ లాడెన్‌తో పాటు కీలక నేతలు తప్పించుకున్నారని అప్పటి నిఘా అంచనాలు పేర్కొన్నాయి. వారి కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలలేదని.. శిక్షణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించే సామర్థ్యం కూడా ఉందని హెచ్చరించాయి. అంటే అప్పటికే అల్‌ఖైదా ఒక ప్రాంతానికి పరిమితమైన ఉగ్రసంస్థగా కాకుండా.. వివిధ దేశాల్లోని అనుబంధ గ్రూపులు, వ్యక్తులు, మద్దతుదారులను ఉపయోగించుకొని ఎక్కడైనా దాడులు చేయగల అంతర్జాతీయ ఉగ్ర నెట్‌వర్క్‌గా రూపాంతరం చెందుతోందని అమెరికా నిఘా వ్యవస్థ గుర్తించింది.

**హెచ్చరికలు వచ్చాయి.. కానీ 9/11ను ఆపలేకపోయారు**

తాజాగా బయటకు వచ్చిన పత్రాల్లో అత్యంత కీలకమైన అంశం ఇదే. 1998 నుంచి 2001 మధ్య బిన్ లాడెన్ నుంచి పెరుగుతున్న ముప్పు గురించి అప్పటి అమెరికా అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ డబ్ల్యూ బుష్‌లకు నిఘా సంస్థలు పలుమార్లు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. విమానాలను కేవలం ప్రయాణ సాధనాలుగా కాకుండా దాడులకు ఆయుధాలుగా ఉపయోగించే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు కూడా అమెరికా నిఘా వ్యవస్థలో చర్చకు వచ్చినట్లు ఈ పత్రాలు సూచిస్తున్నాయి. కానీ చివరకు 2001 సెప్టెంబర్ 11న ప్రపంచం ఊహించని ఘోరం జరిగింది. అల్‌ఖైదాకు చెందిన 19 మంది ఉగ్రవాదులు నాలుగు ప్రయాణికుల విమానాలను హైజాక్ చేశారు. రెండు విమానాలు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ ట్విన్ టవర్స్‌ను ఢీకొట్టాయి. మరో విమానం పెంటగాన్‌ను ఢీకొట్టగా నాలుగో విమానం పెన్సిల్వేనియాలో కూలిపోయింది. దాదాపు మూడు వేల మంది ప్రాణాలు కోల్పోయారు.

**భారత్ పేరు ఇప్పుడు ఎందుకు కీలకం?**

ఈ పత్రాలను కేవలం 'లాడెన్ హిట్ లిస్ట్‌లో భారత్' అనే సంచలన కోణం ఉన్నా అది అమలు కాలేదు.. 1990ల చివరి నాటికే అంతర్జాతీయ ఉగ్రవాదం సరిహద్దులను దాటి విస్తరిస్తోందని నిఘా సంస్థలు గుర్తించాయనడానికి ఇవి మరో సంకేతంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా భారత్ పేరు అప్పటి నిఘా నివేదికల్లో కనిపించడం.. అల్‌ఖైదా వ్యూహాత్మక దృష్టి ఎంత విస్తృతంగా ఉండేదో తెలియజేస్తోంది. అదే సమయంలో ఒక దేశం పేరు లక్ష్యాల జాబితాలో ఉండటం, ఆ దేశంలో నిర్దిష్ట దాడికి పూర్తి స్థాయి ఆపరేషనల్ ప్లాన్ సిద్ధం కావడం రెండూ ఒకటే కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

**28 ఏళ్ల తర్వాత బయటపడిన పాత హెచ్చరిక**

1998లో అత్యంత రహస్యంగా అమెరికా అధ్యక్షుడి ముందుకు వెళ్లిన సమాచారం.. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ప్రపంచం ముందుకు రావడంతో బిన్ లాడెన్ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరో అధ్యాయం తెరుచుకుంది. 9/11 తర్వాత ప్రపంచ దేశాలు ఉగ్రవాదాన్ని చూసే విధానమే మారిపోయింది.

# బ్రిక్స్ గురించి జెన్ జెడ్ ఏమనుకుంటోంది?

ల్లీ వేదికగా జరుగుతున్న 'బ్రిక్స్ సమ్మిట్' కేవలం అంతర్జాతీయ దౌత్య చర్చలకే పరిమితం కాకుండా.. సోషల్ మీడియాలోనూ సంచలనం సృష్టిస్తోంది. ప్రపంచ దేశాల అధినేతలు భారత్‌కు తరలిరావడంతో రాజధాని ఢిల్లీకి గ్లోబల్ లుక్ వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ గ్లోబల్ ఈవెంట్‌పై ఓ జెన్ జెడ్ యువతి వ్యక్తం చేసిన అభిప్రాయాలు ప్రస్తుతం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.






**'గ్లోబల్ వైబ్' ఆకట్టుకుంటోంది**

అంతర్జాతీయ రాజకీయాలు, దౌత్య వ్యూహాల కంటే కూడా సమ్మిట్ వల్ల దేశంలో కనిపిస్తున్న ప్రత్యేకమైన వాతావరణం తనకు ఎంతో నచ్చిందని ఆ యువతి తెలిపింది. ప్రపంచ వేదికపై భారత్ కేంద్ర బిందువుగా మారడం.. విదేశీ అధినేతల రాకతో దేశ రాజధానికి అంతర్జాతీయ మెరుపులు రావడం భారతీయులకు గర్వకారణమని పేర్కొంది.

**సంస్కృతి, ఆతిథ్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు**

బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలు కేవలం ఆర్థిక, రాజకీయ ఒప్పందాలకే కాకుండా భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను చాటి చెప్పడానికి గొప్ప అవకాశమని ఆమె అభిప్రాయపడింది. విదేశీ ప్రతినిధులకు భారతీయ ఆతిథ్య పరిమళాలు అందడంతో పాటు మన దేశ వైవిధ్యం ప్రపంచానికి మరింత దగ్గరవుతుందని వ్యాఖ్యానించింది.

**పెరుగుతున్న భారత్ గ్లోబల్ ఇమేజ్**

ప్రపంచంలో భారత్ పాత్ర రోజురోజుకూ కీలకమవుతోందనడానికి ఈ సమ్మిట్ ఒక నిదర్శనమని యువతి స్పష్టం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో దేశ ఇమేజ్ పెరగడం యువతలో కూడా కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని ఆమె మాటల ద్వారా వ్యక్తమవుతోంది.

**సోషల్ మీడియాలో చర్చగా మారిన 'బ్రిక్స్ం' క్వశ్చన్**

ఈ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన మరో ఘట్టం చోటుచేసుకుంది. 'బ్రిక్స్ం' లో ఎన్ని దేశాలు ఉన్నాయని ప్రశ్నించగా
ఆ యువతి "11 దేశాలు" అని సమాధానమిచ్చింది. ఈ క్లిప్ సోషల్ మీడియాలో రీల్స్‌గా మారి వైరల్ అయింది. బ్రిక్స్ సాంకేతిక, ఆర్థిక వివరాలపై పూర్తి అవగాహన లేకపోయినా... దేశ ప్రతిష్ఠ, సంస్కృతి, గ్లోబల్ వైబ్‌ను ఆమె ఆస్వాదించిన తీరు నెటిజన్లను ఆకట్టుకుంది.

**జెన్ జెడ్ కొత్త కోణం**


సంప్రదాయ రాజకీయ విశ్లేషణలకు అతీతంగా జెన్ జెడ్ అంతర్జాతీయ ఈవెంట్లను ఎలా చూస్తోందో ఈ సంఘటన నిరూపిస్తోంది. దేశ భవిష్యత్తు, బ్రాండ్ ఇమేజ్, గ్లోబల్ ప్రెజెన్స్ వంటి అంశాలకు నేటి తరం ఎంత ప్రాధాన్యత ఇస్తోందో చెప్పడానికి ఈ యువతి కామెంట్స్ ఒక ఉదాహరణగా నిలిచాయి.

# పవన్‌కు కేరళ సీఎం థ్యాంక్స్.. అసలు కథ ఇదే!

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేరళ పర్యటన ఇప్పుడు రాజకీయ అంశాల కంటే మరో కారణంతో ఆసక్తికరంగా మారింది. ఆయుర్వేద చికిత్స కోసం కేరళను ఎంచుకున్న పవన్.. అక్కడి ప్రజల ఆతిథ్యం, ఆలయాల ప్రత్యేకతను ప్రశంసించడంతో కేరళ సీఎం వీడీ సతీశన్ స్పందించారు. పవన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

అయితే ఈ మొత్తం వ్యవహారాన్ని కేవలం ఇద్దరు రాజకీయ నేతల మధ్య జరిగిన సోషల్ మీడియా సంభాషణగా చూడాల్సిన అవసరం లేదు. పవన్ పర్యటన ద్వారా కేరళకు మరోసారి 'వెల్‌నెస్ డెస్టినేషన్'గా ప్రచారం లభించిందనే కోణం కూడా ఇప్పుడు చర్చకు వస్తోంది.





**రాజకీయ భేదాలకు అతీతంగా సాగిన పలకరింపు**

పవన్ కల్యాణ్ తన కేరళ పర్యటన అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అక్కడి ప్రజలు చూపిన ఆప్యాయత, దయ, ఆతిథ్యం తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. అలాగే త్రిప్రయార్ శ్రీరామ స్వామి, గురువాయూర్ శ్రీకృష్ణ, మామ్మియూర్ శ్రీ మహాదేవ, చెట్టికుళంగర శ్రీ భగవతి అమ్మ ఆలయాలను సందర్శించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ పర్యటన తనకు భక్తి, శాంతి, ప్రశాంతతను అందించిందని పవన్ పేర్కొన్నారు. తనకు సహకరించిన కేరళ సీఎం వీడీ సతీశన్, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా కృతజ్ఞతలు తెలిపారు.

పవన్ వ్యాఖ్యలకు సతీశన్ స్పందిస్తూ.. విశ్రాంతి, కోలుకోవడానికి కేరళను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కేరళ ప్రజల ఆప్యాయత, పురాతన ఆలయాల దర్శనం పవన్‌కు ప్రశాంతతను అందించాయని తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పవన్ పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మరోసారి ఆయనకు కేరళలో ఆతిథ్యం ఇవ్వడానికి ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

**'ఆయుర్వేదం' నుంచి 'వెల్‌నెస్ టూరిజం' వరకు..**

పవన్ కేరళలో అడుగుపెట్టడం వెనుక ప్రధాన కారణం రాజకీయ పర్యటన కాదు. భుజానికి శస్త్రచికిత్స అనంతరం తదుపరి చికిత్స కోసం ఆయన అక్కడ ఆయుర్వేద వైద్యం తీసుకుంటున్నారు. దీంతో ఆయన పర్యటనకు సహజంగానే కేరళ ఆయుర్వేదం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. కేరళకు ఇప్పటికే ఆయుర్వేదం, ప్రకృతి చికిత్స, యోగా, సంప్రదాయ వైద్య విధానాలు ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. దేశ, విదేశాల నుంచి వెల్‌నెస్ టూరిజం కోసం కేరళకు వచ్చే వారికి ఇవి కీలక కారణాలుగా నిలుస్తుంటాయి.

ఇలాంటి సమయంలో జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న పవన్ కల్యాణ్ స్వయంగా కేరళను చికిత్స, విశ్రాంతి కోసం ఎంచుకోవడం.. ఆ రాష్ట్రానికి ఒక రకంగా ఆర్గానిక్ ప్రమోషన్ లాంటిదేనని చెప్పొచ్చు.

**ఆలయాలు.. ఆయుర్వేదం.. ఆతిథ్యం**

పవన్ పోస్టులో మరో ఆసక్తికరమైన అంశం ఉంది. ఆయన కేవలం చికిత్స గురించి మాత్రమే మాట్లాడలేదు. కేరళ ప్రజల ఆప్యాయతతో పాటు అక్కడి ఆలయాల గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంటే పవన్ పర్యటనలో మూడు అంశాలు ఒకేసారి హైలైట్ అయ్యాయి. ఆయుర్వేద చికిత్స, కేరళ సంప్రదాయం, ఆలయ పర్యాటకం.. ఇది కేరళ పర్యాటక రంగం ప్రచారం చేసే 'వెల్‌నెస్ కల్చర్' కాన్సెప్ట్‌కు కూడా దగ్గరగా ఉంటుంది. చికిత్స కోసం వెళ్లిన వ్యక్తి.. అక్కడి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కూడా ఆస్వాదించి ప్రశంసించడం ద్వారా కేరళకు ఉన్న బహుముఖ ఆకర్షణ మరోసారి తెరపైకి వచ్చింది.

**కాంగ్రెస్ సీఎం.. ఎన్డీయే నేత.. అయినా వ్యక్తిగత ఆత్మీయత**

ఇక ఈ సంభాషణకు మరో రాజకీయ కోణం కూడా ఉంది. వీడీ సతీశన్ కాంగ్రెస్‌కు చెందిన కీలక నేత..పైగా సీఎం. పవన్ కల్యాణ్ ఏపీలో ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామి. దేశ రాజకీయాల్లో ఈ రెండు వర్గాలు అనేక అంశాలపై భిన్నమైన వైఖరులు తీసుకుంటుంటాయి. అయినప్పటికీ పవన్ ఆరోగ్యంపై కేరళ సీఎం ఆప్యాయంగా స్పందించడం.. పవన్ సైతం కేరళ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పడం.. రాజకీయాలకు అతీతంగా సాగిన మర్యాదపూర్వక సంభాషణగా నిలిచింది.ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో కూడా ఆసక్తిని కలిగిస్తోంది. రాజకీయ ప్రత్యర్థిత్వం ఉన్నప్పటికీ వ్యక్తిగత మర్యాద, రాష్ట్రాల మధ్య ఆతిథ్యం వంటి అంశాలకు చోటు ఉంటుందని ఈ వ్యవహారం మరోసారి చూపించింది.

**పవన్ పర్యటన కేరళకు ఎందుకు ముఖ్యమంటే..**

ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు ఏ రాష్ట్రానికి వెళ్లినా సాధారణంగా రాజకీయ భేటీలు, ప్రకటనలు, కార్యక్రమాలే వార్తల్లో నిలుస్తాయి. కానీ పవన్ విషయంలో మాత్రం చికిత్స, ఆధ్యాత్మికత, కేరళ ఆతిథ్యం ప్రధానంగా చర్చకు వచ్చాయి. అందుకే ఈ పర్యటనను కేవలం పవన్ కల్యాణ్ వ్యక్తిగత విశ్రాంతి పర్యటనగా చూడకుండా.. కేరళ తనకు ఉన్న సంప్రదాయ బలం, వైద్య విధానం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరోసారి ప్రపంచానికి చూపించుకున్న సందర్భంగా కూడా చూడొచ్చు. మొత్తానికి.. పవన్‌కు కేరళ సీఎం చెప్పిన 'థ్యాంక్స్' వెనుక రాజకీయ సమీకరణాల కంటే మానవీయ పలకరింపు, రాష్ట్ర ఆతిథ్యానికి వచ్చిన ప్రశంస, కేరళ ఆయుర్వేదానికి లభించిన ప్రచారం అనే మూడు అంశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# జగన్ పాదయాత్ర.. వైసీపీకి పాత రోజులు వచ్చేనా?

వైసీపీ అధినేత జగన్ 2027 సెప్టెంబరు లేదా అక్టోబరులో పాదయాత్ర చేస్తానని ప్రకటించిన దరమిలా.. ఈ పాదయాత్రతో వైసీపీకి పునర్వైభవం వస్తుందా అనేది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లోనే కాదు.. వైసీపీ నాయకుల్లోనూ చర్చ జరుగుతోంది. వచ్చే ఏడాది రాష్ట్రవ్యాప్తంగా -పాదయాత్ర 2.0-ను నిర్వహించనున్నట్లు జగన్ ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఈ పాదయాత్ర ద్వారా.. తన ఇమేజ్‌ను పెంచుకోవడంతోపాటు.. వచ్చే ఎన్నికల్లో కూటమిని ఓడించి.. తాను అధికారంలోకి రావాలన్నది ఆయన పెట్టుకున్న ప్రధాన లక్ష్యం.

2024 ఎన్నికల ఓటమి తర్వాత ముఖ్యంగా సంక్షేమాన్ని భారీగా అమలు చేశామని చెప్పిన తర్వాత కూడా.. వైసీపీని ప్రజలు 11 స్థానాలకు పరిమితం చేశారు. దీంతో కేడర్ సహా నాయకులు నిరాశలో కూరుకుపోయారు. దీంతో జగన్ పాదయాత్ర నాయకుల్లో కొంత మేరకు జోష్ నింపుతుందని పార్టీ భావిస్తోంది. అయితే.. ఇప్పటికే పలు జిల్లాల్లోకీలక నాయకులు పార్టీ కాడి పడేసిన నేపథ్యంలో ఉన్న నాయకులకు కొత్తవారు తోడవుతారా? లేదా? అనేది చూడాలి. ఇక, ఈ యాత్ర ద్వారా కూటమి ప్రభుత్వ విధానాలు, హామీల వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడం ద్వారా.. వైసీపీ పాలనను తిరిగి తెచ్చేందుకు జగన్ ప్రయత్నించే అవకాశం ఉంది.



**ఒకసారి చేస్తే..**

నిజానికి పాదయాత్రలు ఒక్కసారిఫలిస్తాయి. పదే పదే చేస్తే.. ప్రజలు ఏమేరకు విశ్వసిస్తారన్నది ప్రశ్నార్థకమే. గతంలో 2018-19 మధ్య జగన్ పాదయాత్ర చేశారు. ఒక్క ఛాన్స్ అన్నారు. అప్పట్లో ప్రజలు విశ్వసించారు. మరి ఆ తర్వాత ఐదేళ్ల పాలన చూశాకే కదా.. 11 స్థానాలకు పరిమితం చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా చేపట్టే పాదయాత్రపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చన్న వాదన కూడా వినిపిస్తోంది. అయతే.. గతంలో ప్రజాసంకల్ప యాత్ర ద్వారా జగన్ ప్రజలకు దగ్గరై అధికారంలోకి వచ్చారనే నమ్మకం పార్టీ క్యాడర్‌లో ఉంది. అదే ఇప్పుడు కూడా తమకు కలిసి వస్తుందన్న అంచనాలు వేసుకుంటోంది.

**ప్రతికూలాలు...**

వైసీపీ అధినేత జగన్ గత పాలనకు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు వ్యత్యాసం ఉంది. కేవలం పాదయాత్రతోనే ప్రజల మైండ్‌సెట్ మారుతుందా అనేది చెప్పలేని పరిస్థితి నెలకొంది. 2027లో యాత్ర ప్రారంభించి 2029 నాటికి ప్రజల్లో నిరంతరం ఉండాలనే వ్యూహం ఉన్నప్పటికీ, అప్పటి వరకు కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకతను ఏ స్థాయిలో నిలకడగా కొనసాగిస్తారనేది కీలకం. అదేసమయంలో జగన్ ఇచ్చిన సంక్షేమంతోపాటు.. అభివృద్ధి, ఉపాధికల్పన, ఉద్యోగాలు వంటివాటికి కూటమి సర్కారు ప్రాదాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో పాదయాత్ర ఏమేరకు సక్సెస్ అవుతుందన్నది.. పార్టీ పునర్వైభవాన్ని తెస్తుందా లేదా అనేది వేచి చూడాలి. మరోవైపు కూటమి పక్షాలు రోజు రోజుకు మరింత బలోపేతం అవుతుండడం గమనార్హం.

# ఫలితాలు కనిపించాలి!




బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు తీసుకున్న నిర్ణయాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కనిపించే ఫలితాలుగా మారాలని స్పష్టం చేశారు. దిల్లీలో ఆమోదించిన డిక్లరేషన్, బ్రిక్స్ దేశాల ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఆదివారం మధ్యాహ్నం మోదీ మరోసారి మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగిన చర్చలు బ్రిక్స్‌పై తమ నమ్మకాన్ని మరింత పెంచాయని అన్నారు. బ్రిక్స్ కేవలం కొన్ని దేశాలు కలిసి పనిచేసే వేదిక మాత్రమే కాదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు వెతికే వ్యవస్థగా మారుతోందని పేర్కొన్నారు. బ్రిక్స్ సదస్సులో తీసుకున్న నిర్ణయాలను ఇకపై కాలపరిమితితో అమలు చేయాల్సిన అవసరం ఉందని మోదీ స్పష్టం చేశారు. నిర్ణయాలు, ప్రకటనలు కేవలం ఫైళ్లలో ఉండిపోకూడదని, ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా వాటిని అమలు చేయాలని అన్నారు. చివరి స్థాయిలోనూ ఫలితాలు కనిపించేలా కలిసి పనిచేయాలని బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచం ఇప్పుడు బ్రిక్స్ నుంచి కేవలం ఆలోచనలు, హామీలను మాత్రమే ఆశించడం లేదని అన్నారు. స్పష్టమైన ఫలితాలను కోరుకుంటోందని, బ్రిక్స్ మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో ఈ అంచనాలను అందుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కీలక ఖనిజాలు, సరఫరా వ్యవస్థల విషయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా సరఫరా వ్యవస్థలను మరింత నమ్మకంగా, బలంగా మార్చుకోవచ్చని తెలిపారు. కీలక ఖనిజాలు ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చాలా ముఖ్యమైనవిగా మారుతున్నాయని అన్నారు. ఇంధన భద్రతతో పాటు తక్కువ కాలుష్యంతో కూడిన సాంకేతికతల అభివృద్ధిలో వీటి పాత్ర కీలకమని చెప్పారు. వనరులు ఉన్న దేశాల హక్కులను గౌరవిస్తూ సరఫరా వ్యవస్థలను నమ్మకంగా, వైవిధ్యంగా, స్థిరంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**టెక్నాలజీ విషయంలో అందరికీ అవకాశం!**

టెక్నాలజీ, కీలక ఖనిజాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం బ్రిక్స్ దేశాల ఉమ్మడి అభివృద్ధికి అడ్డంకిగా మారే అవకాశం ఉందని మోదీ హెచ్చరించారు. సాంకేతికతను అందిపుచ్చుకునే విషయంలో అందరికీ సమాన అవకాశాలు ఉండాలని అన్నారు. ఇదే సమయంలో కొత్త ఆవిష్కరణలకు బ్రిక్స్ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్ ద్వారా స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. కొత్త ఆలోచనలు, పెద్ద స్థాయిలో అమలు చేయగల పరిష్కారాలను ప్రోత్సహించేందుకు బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలోనూ టెక్నాలజీని మరింత సమర్థంగా ఉపయోగించుకునేలా బ్రిక్స్ నెట్‌వర్క్ ఆన్ డిజిటల్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మోదీ తెలిపారు. కృత్రిమ మేధ, భౌగోళిక సాంకేతికత, డిజిటల్ మౌలిక వసతులను రైతుల అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవడమే దీని లక్ష్యమన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో బ్రిక్స్‌పై నమ్మకం పెరుగుతోందని మోదీ చెప్పారు. ఆయా దేశాల గొంతుకను వినడం, వారి అనుభవాలను గౌరవించడం, వారికోసం మాత్రమే కాకుండా వారితో కలిసి పరిష్కారాలను రూపొందించడం వల్లే ఈ నమ్మకం పెరిగిందన్నారు.

**బ్రిక్స్ బలం వైవిధ్యంలోనే!**

వేర్వేరు దేశాలు, వేర్వేరు పరిస్థితులు ఉన్నప్పటికీ సహకారంతో ముందుకు సాగడమే బ్రిక్స్ ప్రత్యేకత అని ప్రధాని అన్నారు. వైవిధ్యమే తమ బలం అని పేర్కొన్నారు. ఈ సహకారం మానవాళికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొన్న దేశాల నేతలు, ప్రతినిధులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. వారి సూచనలు, ఆలోచనలు బ్రిక్స్ సహకారానికి మరింత బలం చేకూర్చాయని అన్నారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనున్న చైనాకు శుభాకాంక్షలు తెలిపారు. న్యూఢిల్లీ సదస్సును విజయవంతం చేసిన అన్ని దేశాల బృందాలను అభినందించారు. దిల్లీ డిక్లరేషన్‌తో బ్రిక్స్ మరింత విస్తృతంగా, బలమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని మోదీ స్పష్టం చేశారు.

# రూల్స్ ఫాలో అవ్వడం కాదు.. సెట్ చెయ్యాలి

బ్రిక్స్ కూటమిలో గ్లోబల్ సౌత్ దేశాల గళాన్ని బలంగా వినిపిస్తున్నామని, అందుకే ఆ దేశాలకు ఈ కూటమిపై విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భిన్నత్వం, సహకారమే బ్రిక్స్ బలానికి మూలమని ఆయన ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. ఈ కూటమిలో గ్లోబల్ సౌత్ దేశాల ఆందోళనలు, అనుభవాలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నందునే వాటి నమ్మకాన్ని చూరగొన్నామని తెలిపారు. "నా వ్యక్తిగత అనుభవం నుంచి చెబుతున్నాను, బ్రిక్స్ పట్ల గ్లోబల్ సౌత్ దేశాల విశ్వాసం పెరిగింది. ఎందుకంటే వారి గొంతు ఇక్కడ వినిపిస్తుంది, వారి అనుభవాలను గౌరవిస్తాం. పరిష్కారాలను కేవలం వారి కోసం మాత్రమే కాకుండా, వారితో కలిసి రూపొందిస్తాం. మా భిన్నత్వం, సహకారమే బ్రిక్స్ అసలైన బలం" అని ప్రధాని మోదీ వివరించారు. ఈ వేదికపై విభిన్న దేశాల మధ్య సహకారం ప్రపంచ పురోగతికి, మానవాళి శ్రేయస్సుకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ప్రాముఖ్యతను ప్రధాని నొక్కిచెప్పారు. "భారతీయ నాగరికతలో ప్రకృతికి తల్లి స్థానం ఇచ్చాం. శతాబ్దాలుగా, అభివృద్ధి, పర్యావరణం అనేవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలు కాదని, అవి పరస్పర పూరకాలు అనే




బలమైన నమ్మకం మాది" అని మోదీ అన్నారు. భవిష్యత్ తరాల పట్ల తమ బాధ్యతను గుర్తిస్తూ మానవాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను పాటించడంపై బ్రిక్స్ దృష్టి సారించిందని తెలిపారు. బ్రిక్స్ ఫ్రేమ్‌వర్క్‌లో చేపట్టిన పలు కార్యక్రమాలను ప్రధాని ప్రస్తావించారు. "స్వచ్ఛ ఇంధన వ్యవస్థలను మరింత విశ్వసనీయంగా, సమర్థవంతంగా, అందుబాటులోకి తెచ్చేందుకు స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వల కోసం 'బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేశాం" అని వెల్లడించారు.

అదేవిధంగా, వ్యవసాయం, వాతావరణ మార్పుల అనుసరణ, పర్యావరణ సుస్థిరత వంటి రంగాల్లో సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రంతో అనుసంధానించడం ఎంతో ముఖ్యమని అన్నారు. "వ్యవసాయ పర్యావరణం, పునరుత్పాదక వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్.. సంప్రదాయ పరిజ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానంతో కలుపుతాయి" అని పేర్కొన్నారు.

"మనమంతా విభిన్న వాస్తవికతలతో ముడిపడి ఉండవచ్చు, కానీ సహకారంతో కలిసికట్టుగా ఎదుగుతాం, మానవాళి కోసం వికసిస్తాం. మన భిన్నత్వమే మన గుర్తింపుగా, మన సహకారమే మన స్ఫూర్తిగా నిలవాలి. మన పురోగతి సమస్త మానవాళికి సేవ చేయాలి" అంటూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

**జిన్‌పింగ్ సమక్షంలోనే.. అరుదైన ఖనిజాల అంశం..!**

సాంకేతికతను, సంక్లిష్ట ఖనిజాలను చూపి బెదిరింపులకు పాల్పడటాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి చర్యలు సమష్టి వృద్ధికి అడ్డంకులు సృష్టిస్తాయని పరోక్షంగా చైనాను ఉద్దేశిస్తూ పేర్కొన్నారు. అరుదైన ఖనిజాలపై చైనా ఆధిపత్యం చెలాయిస్తున్న నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అక్కడే ఉండడం గమనార్హం. కాగా ప్రపంచంలోని అరుదైన ఖనిజాలలో సుమారు 90శాతం చైనానే ప్రాసెస్ చేస్తుంది. ఈ ఖనిజాలు సోలార్ ప్యానెళ్ల నుంచి స్మార్ట్‌ఫోన్‌ల వరకు అన్నింటిలోనూ ఉపయోగిస్తారు. గతేడాది అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో.. ఈ అరుదైన ఖనిజాల ఎగుమతిపై నిబంధనలను చైనా కఠినతరం చేసింది. తర్వాత ఆ ఆంక్షలలో కొన్నింటిని సడలించింది.

# మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు

గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు పాకిస్థాన్ భూభాగంలోకి చొరబడి మరీ సమాధానం చెప్పే ప్రధాని భారత్‌కు ఉంటారని ఎవరూ ఊహించలేదని అమిత్ షా అన్నారు. సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్ లేదా 'ఆపరేషన్ సిందూర్', ఇలా ఏది తీసుకున్నా, భారత్‌పై దాడి చేయాలనే ఆలోచన చేయడానికి కూడా శత్రువులు వెన్నులో భయం పుట్టేలా చేసే రక్షణ విధానాన్ని నరేంద్ర మోదీ రూపొందించారని అన్నారు. రామ జన్మభూమి ఆలయ నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్, కేదార్‌నాథ్ పునరుద్ధరణ లేదా 'మహాకాల్ లోక్' నిర్మాణం వంటివి, ఏళ్ల తరబడి ఎవరూ మాట్లాడటానికి కూడా సాహసించని ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారని చెప్పారు. మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చారని, 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో అన్ని దేశాల కంటే ముందుంటుందనే బలమైన విశ్వాసాన్ని ప్రజలకు కలిగించారని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. 2014లో భారత్? 'ఫ్రాజైల్ ఫైవ్' (బలహీనమైన ఐదు దేశాలు) జాబితాలో ఉండగా, నేడు అగ్రశ్రేణి కలిగిన ఐదు దేశాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. నేడు ప్రపంచ దేశాలతో భారత్?కు ఉన్న రత్నాలు, ఆభరణాల వ్యాపార సంబంధాలకు దాదాపు 6,000 సంవత్సరాల నాటి సుదీర్ఘమైన చరిత్ర ఉందని షా పేర్కొన్నారు. ఆదివారం ముంబయిలో జరిగిన 52వ ఇండియా జెమ్ అండ్? జ్యువెలరీ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న షా ఈ మేరకు ప్రసంగించారు. "ల్యాబ్ గ్రోన్ డైమండ్ల(కృత్రిమ వజ్రాలు) వ్యవస్థపై భారతీయులకు పట్టు ఉండాలి. దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సామర్థ్యాలు మన వద్ద ఉన్నాయి. పరిమాణం పరంగా చూస్తే, ల్యాబ్-గ్రోన్ డైమండ్ల మార్కెట్ ప్రస్తుత వజ్రాల మార్కెట్ కంటే దాదాపు 50 రెట్లు విస్తరించే అవకాశం ఉంది. కాబట్టి ఇది మన దేశానికి ఒక గొప్ప అవకాశం అని చెప్పవచ్చు. వీటన్నింటికీ మించి దేశాన్ని ముందుకు నడిపించేందుకు సమర్థులైన పారిశ్రామికవేత్తలు మన దేశంలో ఉన్నారు. వజ్రాలను తయారు చేసే యంత్రాల ఉత్పత్తి నుంచి, ఆభరణాల రూపకల్పన, బ్రాండ్‌లను అభివృద్ధి చేయడం, ప్రపంచ వ్యాప్తంగా భారతీయ కంపెనీల షోరూమ్‌లను తెరవడం వరకు ప్రతి ఒక్క అడుగు భారతీయ హస్తాల్లోనే ఉండాలి."



**'డీకాలనైజేషన్ అంటే గతాన్ని తుడిచిపెట్టడం కాదు'**

డీకాలనైజేషన్ అంటే కేవలం గతాన్ని తుడిచిపెట్టడం మాత్రమే కాదని, సత్యాన్ని భారతీయ కోణంలో ప్రామాణికంగా అందించడమేనని అమిత్ షా స్పష్టం చేశారు. దేశ చరిత్ర, సంప్రదాయాలు, భాషలు, పురావస్తు గ్రంథాలను కాపాడుకోవాలని, అలాగే వాటిని ప్రజల చెంతకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారు జ్ఞానాన్ని, అధికారాన్ని ఒకదానితో ఒకటి ముడిపెట్టారని, ఆ ఫ్రేమ్‌వర్క్ నుంచి జ్ఞానాన్ని విముక్తం చేయడమే ఇప్పుడు మన ముందున్న కర్తవ్యమని షా వ్యాఖ్యానించారు. ఒక దేశం ఎంత శక్తిమంతమైనదైనప్పటికీ, అది తన జ్ఞాపకాలు, చరిత్ర, సంప్రదాయాలు, సంస్కృతి, భాషల, పురాతన గ్రంథాలను కాపాడుకోవడంలో విఫలమైతే ఎక్కువ కాలం మనుగడ సాధించలేదని స్పష్టం చేశారు. ఆదివారం, ముంబయిలోని ఆసియాటిక్ సొసైటీలో 'గణేశ్? జ్ఞానార్థి' ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు.

"నిజమైన జ్ఞానం ఎన్నడూ ఒక సిద్ధాంతానికి బందీ కాకూడదు. దాన్ని ఏ విధంగానైనా బంధిస్తే, అసలు జ్ఞానానికున్న అర్థాన్నే మార్చినట్లు అవుతుంది. కాబట్టి జ్ఞానం, దాని ప్రకటన స్వేచ్ఛగా, నిరభ్యంతరంగా ఉండాలి. చాలా కాలంగా భారతీయ జ్ఞానాన్ని వలసవాద దృక్పథంతోనే వివరించారు. ఫలితంగా భారతీయుల్లో ఒక రకమైన ఆత్మన్యూనతా భావం ఏర్పడింది. ఆసియాటిక్ సొసైటీ వంటి సంస్థలు ఈ జ్ఞానాన్ని పరిరక్షించి దేశం, ప్రపంచ శ్రేయస్సు కోసం ఉపయోగించడానికి సహాయపడతాయి." ఈ సందర్భంగా, బీజేపీ నాయకుడు వినయ్ సహస్రబుద్ధే నేతృత్వంలోని 'ఆసియాటిక్ సొసైటీ' నూతన కమిటీకి షా ఒక సూచన చేశారు. సంస్థ వద్ద ఉన్న విస్తారమైన సమాచార భాండాగారాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. అలాగే, భారతీయ కోణంలో చారిత్రక పరిశోధనలు సాగించేందుకు వారిని ఈ సంస్థకు ఆహ్వానించాలని సూచించారు. రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన ఈ సొసైటీలోని గ్రంథాలు, పత్రాలను డిజిటలైజ్ చేసి, దేశంలోని ఇతర గ్రంథాలయాలతో ఎలక్ట్రానిక్ పద్ధతిలో పంచుకోవాలని పిలుపునిచ్చారు. భారతీయ వారసత్వాన్ని పరిరక్షించే సంస్థలు, గ్రంథాలను అనుసంధానించే ఒక ఉమ్మడి వేదికను సృష్టించాలని, దానికి ఆసియాటిక్ సొసైటీ ప్రముఖ పాత్ర పోషించాలని ఆయన ప్రతిపాదించారు. మహారాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లోని ఇళ్లలో ఉన్న తాళపత్ర గ్రంథాలు, పూర్వీకుల శాస్త్రాలను గుర్తించి, వాటిని జ్ఞాన్ భారతం జాతీయ తాళపత్ర గ్రంథ మిషన్ పరిధిలోకి తీసుకురావాలని షా నొక్కి చెప్పారు. భారత ఆర్థిక, వ్యూహాత్మక పురోగతిని సుసంపన్నం చేసే జ్ఞానం తాళపత్ర గ్రంథాల్లో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మహాభారతం, జైన కల్పసూత్రం, బౌద్ధ గ్రంథాల సచిత్ర ప్రతులతో సహా ఆసియాటిక్ సొసైటీ వద్ద ఉన్న విస్తారమైన సేకరణలు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు, పరిశోధకులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. తాను కేవలం కేంద్ర హోం మంత్రిగా మాత్రమే కాకుండా, వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న భారతీయ జ్ఞాన సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లే ఉద్యమంలో ఒక భాగస్వామిగా ఈ సొసైటీకి వచ్చానని షా పేర్కొన్నారు.

## దక్షిణాఫ్రికాతో ఆర్థిక బంధంపై ఫోకస్

దిల్లీ వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు జరిగిన వేళ, భారత ప్రధాని నరేంద్ర మోదీ పలువురు దేశాధినేతలతో వరుసగా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. కజకిస్థాన్ అధ్యక్షుడు కస్సిమ్- జొమార్ట్ టోకయేవ్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఉగాండా ఉపాధ్యక్షురాలు జెస్సికా అలుపో, బురుండి అధ్యక్షుడు ఎవరిస్టే న్దాయిషిమియేతో మోదీ భేటీ అయ్యారు. ఆ సమావేశాల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలు, ఆర్థిక సహకారం, ప్రాంతీయ పరిణామాలు, గ్లోబల్ సౌత్‌కు సంబంధించిన అంశాలపై చర్చలు జరిగాయి.

**టోకయేవ్‌తో కీలక చర్చలు**

బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు దిల్లీ వచ్చిన కజకిస్థాన్ అధ్యక్షుడు టోకయేవ్‌తో మోదీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. భారత్-కజకిస్థాన్ మధ్య సంబంధాలకు మూడు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. 1992లో కజకిస్థాన్ స్వాతంత్ర్యాన్ని గుర్తించిన తొలి దేశాల్లో భారత్ కూడా ఒకటి. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో సంబంధాలు కొనసాగుతున్నాయి. సాంకేతిక సహకారానికి కూడా ఇరు దేశాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. భారత్ అందించిన 'పరం బిలిమ్' సూపర్ కంప్యూటర్‌ను కజకిస్థాన్‌లో అప్‌గ్రేడ్ చేసి 2025 జూన్‌లో తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో టోకయేవ్‌తో మోదీ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

**ఫిలిప్పీన్స్‌తో యాక్ట్ ఈస్ట్ దిశగా!**

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌తోనూ మోదీ సమావేశమయ్యారు. ప్రస్తుతం ఆసియాన్‌కు ఫిలిప్పీన్స్ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో మార్కోస్ భారత్‌కు వచ్చారు. ఆసియాన్‌తో భారత వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఫిలిప్పీన్స్ కీలకంగా ఉంది. ముఖ్యంగా వాణిజ్యం, సముద్ర భద్రత, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అనుసంధానం వంటి అంశాల్లో భారత్-ఆసియాన్ సహకారం కొనసాగుతోంది. మోదీ యాక్ట్ ఈస్ట్ విధానంలో భాగంగా ఈ సంబంధాలకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నారు. మార్కోస్ భార్య లూయిస్ అరనెటా-మార్కోస్‌తో కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి కూడా సమావేశమయ్యారు. మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధి, మహిళలను సమాన భాగస్వాములుగా ముందుకు తీసుకెళ్లాలన్న భారత్ ఆలోచనను ఆమె వివరించారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసాతో మోదీ సమావేశమయ్యారు. బ్రిక్స్‌లో దక్షిణాఫ్రికా కీలక సభ్యదేశంగా ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పులు, వాణిజ్య విధానాల్లో పరిణామాలు, సాంకేతిక అభివృద్ధి, వాతావరణ మార్పుల నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు కొత్త అవకాశాలను సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని రమాఫోసా ఇప్పటికే పేర్కొన్నారు. కేవలం ఒకరికొకరు వస్తువులు అమ్ముకోవడం మాత్రమే కాకుండా, ఉత్పత్తి, సాంకేతికత, పెట్టుబడులు, పరిశ్రమల రంగాల్లో లోతైన భాగస్వామ్యాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మోదీ-రమాఫోసా భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఉగాండా, బురుండితోనూ భేటీలు**

ఉగాండా ఉపాధ్యక్షురాలు జెస్సికా అలుపోతో మోదీ భేటీ అయ్యారు. 2026 బ్రిక్స్ సదస్సులో పాల్గొంటున్న 10 భాగస్వామ్య దేశాల్లో ఉగాండా కూడా ఉంది. భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సు ద్వారా ఆఫ్రికా దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నం జరుగుతోంది. ఆఫ్రికన్ యూనియన్ ప్రతినిధిగా బ్రిక్స్ సదస్సుకు హాజరైన బురుండి అధ్యక్షుడు ఎవరిస్టే న్దాయిషిమియేతోనూ మోదీ సమావేశమయ్యారు. గ్లోబల్ సౌత్ దేశాల ఉమ్మడి ప్రయోజనాలపై భారత్ దృష్టి పెట్టిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇదే సమయంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్‌తో సమావేశమయ్యారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలతో పాటు ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై ఇరువురు చర్చించారు.

**ఇక మాటలు కాదు- చేతల్లో ఫలితాలు!**

మరోవైపు 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సందర్భంగా మోదీ కీలక సందేశం ఇచ్చారు. బ్రిక్స్ మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో ప్రపంచం నుంచి ఈ కూటమిపై అంచనాలు మరింత పెరిగాయని చెప్పారు. ఇక కేవలం ఆలోచనలు, హామీలు చెప్పడం మాత్రమే సరిపోదని.. స్పష్టమైన ఫలితాలను చూపించాల్సిన సమయం వచ్చిందని మోదీ స్పష్టం చేశారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను నిర్దిష్ట కాలవ్యవధిలో అమలు చేయాలని పిలుపునిచ్చారు. బ్రిక్స్‌పై గ్లోబల్ సౌత్ దేశాల నమ్మకం పెరుగుతోందని మోదీ అన్నారు. విపత్తుల నిర్వహణ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సహకారం, పర్యావరణం వంటి రంగాల్లో భారత్ చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకుండా వ్యాపారవేత్తలు, రైతులు, పరిశోధకులు, మహిళలు, యువత, సామాన్య ప్రజలకు చేరాలని ఆకాంక్షించారు.

## చైనా విషయంలో కేంద్రం వ్యూహాత్మకంగా లొంగిపోతోంది



చైనా విషయంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల ద్వైపాక్షిక సమావేశం జరిగిన మరుసటి రోజే, కేంద్రంపై ప్రశ్నల వర్షం కురిపించింది. చైనా ముందు మోదీ సర్కార్ "వ్యూహాత్మకంగా లొంగిపోతోందని" కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. చైనా విషయంలో ప్రభుత్వ మాటలకు, చేతలకు ఏమాత్రం పొంతన లేదని ఆయన విమర్శించారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతలే ఇరు దేశాల మధ్య సత్సంబంధాలకు అత్యంత కీలకమని చైనా అధ్యక్షుడికి ప్రధాని మోదీ స్పష్టం చేసిన మరుసటి రోజే కాంగ్రెస్ ఈ విమర్శలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మేరకు జైరాం రమేశ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రధాని మోదీ ముందు నాలుగు కీలక ప్రశ్నలను ఉంచారు.

1. భారత భూభాగంలోకి ఎవరూ ప్రవేశించలేదని, మన పోస్టులు ఏవీ చైనా ఆధీనంలో లేవని 2020 జూన్ 19న మీరు చేసిన ప్రకటన, గల్వాన్ ఘర్షణల తర్వాత చైనాతో చర్చల్లో మన స్థానాన్ని బలహీనపరిచిందా? తూర్పు లఢఖ్‌లోని అనేక ప్రాంతాల్లో సంప్రదాయ పెట్రోలింగ్, పశువుల మేత హక్కులను భారత్ కోల్పోయిందన్న ఆరోపణలపై మీ సమాధానం ఏమిటి?

2. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా చొరబాట్లు పెరిగాయని, అనేక పెట్రోలింగ్ పాయింట్లకు మన సైనికులకు ప్రవేశం లేకుండా పోయిందని వార్తలు వస్తున్నాయి. అరుణాచల్‌లోని పట్టణాల పేర్లను చైనా మార్చడం, దానిని 'దక్షిణ టిబెట్'గా పేర్కొనడం, బ్రహ్మపుత్ర నదిపై 60,000 మెగావాట్ల మెడాగ్ మెగా-డ్యామ్‌ను నిర్మించడం వంటి చర్యలతో మన ఈశాన్య రాష్ట్రాల నీటి భద్రతను ప్రమాదంలో పడేస్తున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది?

3. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు చైనా అండగా నిలిచిందని 2025 జులై 4న ఆర్మీ ఉన్నతాధికారి లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ స్పష్టంగా చెప్పారు. కానీ, 2026 ఆగస్టు 25న మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ దీనికి పూర్తి భిన్నమైన ప్రకటన చేశారు. చైనా అధ్యక్షుడి పర్యటనకు ముందు వాతావరణాన్ని మార్చే వ్యూహంలో భాగంగానే ఈ వైఖరిలో మార్పు వచ్చిందా?

4. చైనాతో మన వాణిజ్య లోటు రికార్డు స్థాయికి ఎందుకు చేరనిచ్చారు? 2025-26 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య లోటు 112.6 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది మన పరిశ్రమలను, ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగాన్ని నాశనం చేస్తోంది. కీలకమైన ముడిసరుకులు, విడిభాగాల కోసం చైనాపై ఆధారపడటం ప్రమాదకర స్థాయికి చేరింది. ఈ ఆమోదయోగ్యం కాని పరిస్థితిని మార్చడానికి మీ వద్ద ఉన్న రోడ్‌మ్యాప్ ఏమిటి?

ఈ ప్రశ్నలతో కాంగ్రెస్ పార్టీ, చైనా సరిహద్దు భద్రత, ఆర్థిక సవాళ్లపై కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా తప్పుబట్టింది. ఈ అంశాలపై ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

సోమవారం 14 సెప్టెంబర్ 2026

## సంపాదకీయం

# భారత్‌కు ఊరట!


ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ 2026 సదస్సు 'న్యూఢిల్లీ డిక్లరేషన్'ను ఆమోదించడంతో, ఆతిథ్య దేశంగా భారత్ ఎదుర్కొన్న పరీక్షకు సానుకూల ఫలితం లభించినట్టే. సభ్యదేశాల మధ్య తీవ్ర భౌగోళిక-రాజకీయ విభేదాలున్న తరుణంలో, ఉమ్మడి ప్రకటనను రూపొందించడమే పెద్ద సవాలు. అందులో ముఖ్యంగా ఉగ్రవాదంపై కూటమి తీసుకున్న కఠిన వైఖరి భారత్‌కు దౌత్యపరమైన విజయంగా చెప్పుకోవచ్చు. కారణం, ఉద్దేశం ఏదైనప్పటికీ ఉగ్రవాద చర్యలను ఏమాత్రం సమర్థించలేమని బ్రిక్స్ దేశాలు స్పష్టం చేయడంతోపాటు, 26మంది ప్రాణాలు బలిగొన్న 2025 ఏప్రిల్ 22నాటి జమ్మూకశ్మీర్ ఉగ్రదాడిని అత్యంత తీవ్ర పదజాలంతో ఖండించడం గమనార్హం. గతంలో ఇలాంటి అంతర్జాతీయ వేదికలపై పహల్గాం దాడిని నేరుగా ప్రస్తావించడంలో సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించడం భారత్‌కు కష్టతరంగా ఉండేది, ముఖ్యంగా చైనా, పాకిస్థాన్‌తో దాని సన్నిహిత సంబంధాల నేపథ్యంలో. ఈసారి డిక్లరేషన్‌లో ఈ దాడిని ప్రత్యేకంగా ప్రస్తావించడం, ఉగ్రవాదాన్ని ఏ మతం, జాతీయత, నాగరికతతోనూ ముడిపెట్టకూడదని స్పష్టం చేయడం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలను అంగీకరించబోమని పేర్కొనడం భారత్ దీర్ఘకాలంగా అంతర్జాతీయ వేదికలపై వినిపిస్తున్న వాదనలకు బలం చేకూర్చింది. ఉగ్రవాదానికి అందుతున్న ఆర్థిక సాయం, సరిహద్దుల ఆవల నుంచి సాగుతున్న కార్యకలాపాలు, ఆశ్రయం కల్పించే చర్యలను ఉమ్మడిగా ఎదుర్కొంటామని పునరుద్ఘాటించడం కూడా ఈ దిశగా భారత్ చేసిన దౌత్యపరమైన కృషికి నిదర్శనం.

అయితే కేవలం ఉగ్రవాదంపై వైఖరి ఆధారంగానే భారత్ తన పరీక్షలో పూర్తిగా నెగ్గిందని చెప్పలేం. డిక్లరేషన్‌లో ప్రస్తావించిన ఇతర అంశాలను పరిశీలిస్తే, భారత్ అనేక సున్నిత విషయాల్లో సభ్యదేశాల మధ్య సమతుల్యతను సాధించాల్సి వచ్చిందని స్పష్టమవుతుంది. పాలస్తీనా అంశంపై బ్రిక్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, గాజాలో కాల్పుల విరమణను కొనసాగించాలని, పాలస్తీనియన్ల బలవంతపు తరలింపులను వ్యతిరేకిస్తూ, రెండు దేశాల సిద్ధాంతానికి మద్దతు పలకడం చూస్తే, ఇజ్రాయెల్‌తో సాన్నిహిత్యం పెంచుకుంటున్న భారత్‌కు ఇది కొంత ఇబ్బందికరమైన అంశమే. అయినప్పటికీ, ఆక్రమిత జెరూసలేం స్థితిని మార్చే ఏకపక్ష చర్యలను వ్యతిరేకించడం, పవిత్ర స్థలాల గౌరవాన్ని కాపాడాలని కోరడం వంటి అంశాల్లో సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడంలో భారత్ విజయం సాధించింది. ఇక ఆర్థిక రంగంలో, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లో సంస్కరణలు, కోటా మార్పులు, డబ్ల్యూటీఓ బలోపేతం వంటి డిమాండ్లలో భారత్ ప్రయోజనాలకు అనుగుణంగానే డిక్లరేషన్ రూపొందింది. అయితే డీ-డాలరైజేషన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తం చేసిన అనుమానాలు, బెదిరింపుల నేపథ్యంలో, డిక్లరేషన్‌లో ఏకపక్ష సుంకాలు, రక్షణవాదంపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, నేరుగా అమెరికాను రెచ్చగొట్టే భాషను నివారించడం భారత్ దౌత్యనీతికి పరీక్షగానే మిగిలింది. ఏకపక్ష ఆర్థిక ఆంక్షలను ఖండిస్తూ, క్యూబాపై ఆంక్షల ఎత్తివేతకు మద్దతు పలకడంవంటి అంశాలు చైనా, రష్యా ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉన్నప్పటికీ, అమెరికాతో సంబంధాలను పునరుద్ధరించుకోవాలని చూస్తున్న భారత్‌కు ఇవి ఇబ్బందికరమైన సమతుల్యతా సాధనగా మిగిలాయి.

మొత్తంగా చూస్తే, న్యూఢిల్లీ డిక్లరేషన్ భారత్‌కు పాక్షిక విజయాన్నే అందించిందని చెప్పవచ్చు. ఉగ్రవాదంపై కఠిన వైఖరి, పహల్గాం దాడి ప్రస్తావన వంటి అంశాల్లో భారత్ తన లక్ష్యాన్ని సాధించగలిగినా, పాలస్తీనా, అమెరికా సుంకాలు, డాలర్ ఆధిపత్యంవంటి సున్నిత అంశాల్లో అన్ని సభ్యదేశాల ప్రయోజనాలను సమతుల్యం చేయాల్సి వచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సురక్షితంగా, అందరినీ కలుపుకొనిపోయేలా అభివృద్ధి చేయాలన్న డిమాండ్, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం అవసరమన్న అంశం, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ సామర్థ్యాన్ని పెంచుకోవాలన్న ఆకాంక్ష వంటివి అన్ని సభ్యదేశాలకూ ఆమోదయోగ్యమైన సాధారణ లక్ష్యాలుగా మిగిలాయి. ఇవి వివాదాస్పదం కానందున సులభంగా ఏకాభిప్రాయం సాధించగలిగారు. మహిళలకు, గ్లోబల్ సౌత్‌కు మెరుగైన ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 1325 అమలుకు కట్టుబడి ఉండటం వంటివి కూడా భారత్ ప్రాధాన్యతలకు అనుగుణంగానే ఉన్నాయి. అయితే నిజమైన పరీక్ష డిక్లరేషన్‌లోని మాటలు ఆచరణలో ఎంతమేర అమలవుతాయన్నదే. ఉగ్రవాదంపై కఠిన వైఖరి కాగితాలపై కనిపించినా, దానిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో సభ్యదేశాల చిత్తశుద్ధి ఎంత అన్నదే అసలైన ప్రశ్న. చైనా, రష్యావంటి దేశాలు తమ సొంత భౌగోళిక-రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాద అంశాన్ని ఎంతమేర సీరియస్‌గా తీసుకుంటాయన్నది భవిష్యత్తులో తేలాల్సిన విషయం. అయితే ప్రస్తుతానికి, విభిన్న ప్రయోజనాలు కలిగిన 11 దేశాల కూటమిని ఒక ఉమ్మడి వేదికపైకి తీసుకురాగలగడం, ముఖ్యంగా తనకు అత్యంత ముఖ్యమైన ఉగ్రవాద వ్యతిరేక వైఖరిపై స్పష్టమైన మాటలు రాబట్టగలగడం భారత దౌత్యనీతిలో ఒక ముఖ్యమైన విజయంగానే చెప్పవచ్చు. ఈ దృష్టితో చూస్తే, న్యూఢిల్లీ డిక్లరేషన్‌తో భారత్ తన ఆతిథ్య బాధ్యతలో ఎదురైన కఠిన పరీక్షను చాలావరకు విజయవంతంగానే పూర్తి చేసింది.

ఉగ్రవాదంపై కఠిన వైఖరి, పహల్గాం దాడి ప్రత్యేక ప్రస్తావన భారత్‌కు గణనీయమైన దౌత్యపరమైన విజయమే. ఏ కారణమైనా ఉగ్రవాదాన్ని సమర్థించలేమని, ద్వంద్వ ప్రమాణాలు అంగీకరించమని కూటమి స్పష్టం చేయడం భారత్ దీర్ఘకాలంగా వినిపిస్తున్న వాదనకు బలం చేకూర్చింది. అయితే సున్నిత విషయాల్లో సభ్యదేశాల ప్రయోజనాలను సమతుల్యం చేయాల్సి రావడం.. ఇజ్రాయెల్‌తో సాన్నిహిత్యం పెంచుకుంటున్న భారత్‌కు ఇబ్బందికరమే. నిజానికి -అసలైన పరీక్ష ఇప్పుడే మొదలవుతుంది. డిక్లరేషన్‌లోని మాటలు క్షేత్రస్థాయిలో ఎంతమేర అమలవుతాయో చూడాలి. పాకిస్థాన్‌తో సన్నిహిత సంబంధాలున్న చైనా, రష్యా ఉగ్రవాద అంశాన్ని ఎంత చిత్తశుద్ధితో తీసుకుంటాయన్నదే కీలకం. మొత్తానికి, విభిన్న ప్రయోజనాలు కలిగిన 11 దేశాల కూటమిని ఏకతాటిపైకి తీసుకురాగలగడం భారత దౌత్యనీతికి ముఖ్యమైన విజయమే. అయితే వాగ్దానాలు ఆచరణలో రూపుదిద్దుకోవడమే నిజమైన కొలమానమని మర్చిపోకూడదు.

## పనికొచ్చే పలుకు



# ప్రేమకు హద్దులు.. క్రమశిక్షణకు అర్థం

పిల్లలు పడిపోతారేమోనని ఎప్పుడూ చేయి పట్టుకుంటే.. వారు నడవడం నేర్చుకుంటారు కానీ, ఒంటరిగా నిలబడటం నేర్చుకోలేరు. జీవితంలో ఎక్కడా ఓటమి ఎదురుకాకుండా కాపాడితే.. విజయం విలువ కూడా తెలియదు. అందుకే పిల్లల పెంపకంలో ప్రేమ ఎంత ముఖ్యమో.. క్రమశిక్షణా అంతే ముఖ్యం. ప్రేమ పేరుతో ప్రతి కోరిక తీర్చడం, ప్రతి తప్పును సమర్థించడం, ప్రతి కష్టాన్ని వారి నుంచి దూరం చేయడం మంచి పేరెంటింగ్ కాదు. ప్రేమతో పాటు బాధ్యతను నేర్పడం, స్వేచ్ఛతోపాటు హద్దులను చూపించడం, వారి మాట వినడంతోపాటు అవసరమైనప్పుడు 'కాదు' అని చెప్పడం.. పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయి. అందుకే 'అథారిటేటివ్ పేరెంటింగ్' అనే విధానం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇందులో తల్లిదండ్రులు పిల్లలపై కఠినమైన నియంతృత్వాన్ని ప్రదర్శించరు. అదే సమయంలో ఏది చేసినా సరేనని వదిలేయరు. పిల్లల భావాలను వింటారు.. అభిప్రాయాలను గౌరవిస్తారు.. అవసరమైన నియమాలను మాత్రం స్పష్టంగా చెబుతారు. ఉదాహరణకు ఫోన్ వాడకానికి సమయం నిర్ణయించడం, చదువు-ఆటలకు సమతుల్యత పాటించడం, ఇంటి పనుల్లో చిన్న బాధ్యతలు అప్పగించడం, తప్పు చేస్తే దాని పరిణామాన్ని అనుభవించే అవకాశం ఇవ్వడం వంటివి పిల్లల్లో బాధ్యతా భావాన్ని పెంచుతాయి. ముఖ్యంగా 'నువ్వు తప్పు చేశావు కాబట్టి నిన్ను ప్రేమించడం లేదు' అనే భావనకు బదులుగా.. 'నీపై నాకు ప్రేమ ఉంది, కానీ ఈ ప్రవర్తన మాత్రం సరైంది కాదు' అనే సందేశాన్ని ఇవ్వడం ఎంతో ప్రభావవంతంగా ఉంటుంది.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. క్రమశిక్షణ అంటే శిక్ష కాదు. భయపెట్టి మాట వినిపించడం కాదు. పిల్లలను అందరి ముందు అవమానించడం అసలే కాదు. క్రమశిక్షణ అంటే సరైనది-తప్పు మధ్య తేడాను అర్థం చేసుకునేలా చేయడం. ఒక పని చేయకపోతే దాని ఫలితం ఏమిటో ముందుగానే చెప్పడం. చెప్పిన నియమాలను తల్లిదండ్రులు కూడా స్థిరంగా పాటించడం. ఒకరోజు అనుమతించి, మరుసటి రోజు అదే పనికి కోపగించుకోవడం పిల్లల్లో గందరగోళాన్ని సృష్టిస్తుంది. కాబట్టి నియమాలు తక్కువగా ఉన్నా.. స్పష్టంగా, స్థిరంగా ఉండాలి. పిల్లలకు కష్టాలు తెలియకుండా పెంచడం కంటే.. చిన్న చిన్న కష్టాలను ఎదుర్కొనేలా చేయడం మంచిది. ఓడినప్పుడు వెంటనే ఓదార్చడం మాత్రమే కాదు.. ఎందుకు ఓడిపోయారో ఆలోచించేలా చేయాలి. పని ఆలస్యమైనప్పుడు తల్లిదండ్రులే పూర్తి చేయడం కాకుండా.. కొంత సమయమిచ్చి వారు పూర్తి చేసేలా ప్రోత్సహించాలి. కోరిన వస్తువు వెంటనే ఇవ్వకుండా.. దాని విలువను అర్థం చేసుకునేలా చేయాలి. ఇలా చిన్న చిన్న అనుభవాలే భవిష్యత్తులో పెద్ద సవాళ్లను ఎదుర్కొనే శక్తిగా మారతాయి. నిజానికి మంచి పేరెంటింగ్ లక్ష్యం 'మన పిల్లలు ఎప్పుడూ మనపై ఆధారపడాలి' అనేది కాదు.. 'ఒకరోజు మన సహాయం లేకుండానే ధైర్యంగా జీవించగలగాలి' అనేదే. ప్రేమతో పెంచాలి.. కానీ బలహీనంగా కాదు. నియమాలు పెట్టాలి.. కానీ నిర్దయగా కాదు. పిల్లల మాట వినాలి.. కానీ ప్రతి కోరికను అంగీకరించాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రుల ప్రేమకు క్రమశిక్షణ తోడైతేనే అది పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తిగా మారుతుంది. ఈ మార్పు పిల్లల భవిష్యత్తును మాత్రమే కాదు.. ఇంటి వాతావరణాన్ని, తల్లిదండ్రుల అలవాట్లను, చివరకు మొత్తం కుటుంబ జీవనశైలినీ ఆరోగ్యకరంగా మార్చగలదు.

పిల్లల దారిలోని ప్రతి ముల్లును తల్లిదండ్రులే తొలగిస్తే.. జీవితంలో వచ్చే ముళ్లను ఎలా ఎదుర్కోవాలో వారు ఎప్పుడు నేర్చుకుంటారు? ప్రేమతో చేయి పట్టుకోవాలి.. కానీ ప్రతి అడుగూ మనమే వేయకూడదు; క్రమశిక్షణతో నడవడం నేర్పినప్పుడే పిల్లలు జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోగలరు.


# యుద్ధానికి 'హూతీ'ల మలుపు!



యెమెన్‌లోని దక్షిణ టిహామా ప్రాంతంలో హూతీ తిరుగుబాటుదారులు అనూహ్యంగా మెరుపు వేగంతో ముందుకుదూసుకెళ్లడం అంతర్జాతీయ పరిశీలకులను ఆశ్చర్యపరుస్తోంది. ఇప్పటివరకు హూతీలకు వ్యతిరేకంగా పోరాడుతూ, ఎర్రసముద్ర తీరంలోని ఎడారి మైదాన ప్రాంతమైన టిహామాలో ఎక్కువ భాగాన్ని తన ఆధీనంలో ఉంచుకున్న నేషనల్ రెసిస్టెన్స్ కూటమి, కేవలం కొద్దిరోజుల వ్యవధిలోనే ఆ భూభాగాన్ని కోల్పోయింది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన 130 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని ఇరాన్ మద్దతున్న ఈ తిరుగుబాటుదారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారని అంచనాలు చెబుతున్నాయి. గత కొన్నేళ్లలో హూతీలు సాధించిన అతిపెద్ద సైనిక విజయాల్లో ఇది ఒకటి. 12 ఏళ్లుగా కొనసాగుతున్న అంతర్యుద్ధం, సౌదీ అరేబియా జరిపిన భారీ వైమానిక దాడులు, అమెరికా-ఇజ్రాయెల్-బ్రిటన్ దళాల ప్రత్యక్ష దాడులు ఎదురైనప్పటికీ హూతీలు ఒక బలమైన శక్తిగానే మిగిలారని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ప్రత్యర్థులు షాక్‌కు గురై, ధైర్యం కోల్పోయిన పరిస్థితుల్లో, హూతీలు తాము గెలుచుకున్న భూభాగంలో వేగంగా తమ స్థావరాలను పటిష్టం చేసుకుంటున్నారని బ్రస్సెల్స్‌కు చెందిన విశ్లేషకుడు హిషామ్ అల్-ఒమిసీ అభిప్రాయపడ్డారు. హూతీలను కేవలం ఇరాన్ చేతిలో కీలుబొమ్మలుగా చూడటం సరికాదని, అయితే లెబనాన్‌లోని హిజ్బుల్లా, గాజాలోని హమాస్, సిరియాలోని అసద్ ప్రభుత్వంవంటి 'యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్' మిత్రపక్షాలు వరుస ఎదురుదెబ్బలు చవిచూసిన నేపథ్యంలో, ఇరాన్ తన మద్దతును పూర్తిగా హూతీలవైపు మళ్లించిందని ఆయన విశ్లేషించారు. ఇరుపక్షాలకూ ఈ మద్దతు పరస్పరం అవసరమైన తరుణంలో, హూతీల విజయాలు ఇరాన్ వ్యూహంలో భాగంగానే జరుగుతున్నాయనే అభిప్రాయం బలపడుతోంది.

ఈ పరిణామాలు కేవలం యెమెన్ అంతర్గత సంఘర్షణకే పరిమితం కాకుండా, ప్రపంచ ఇంధన వాణిజ్యంపైనే తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై భారీ దాడులు ప్రారంభించి ఏడు నెలలు గడిచిన తర్వాత, ఇరాన్‌కు ప్రపంచంలోని రెండు అత్యంత కీలకమైన సముద్రమార్గాలపై అనూహ్యంగా పట్టు లభించింది. పర్షియన్ గల్ఫ్ ప్రవేశద్వారం వద్ద ఉన్న హార్ముజ్ జలసంధి, ఎర్రసముద్రానికి, సూయజ్ కాలువకు వెళ్లే ప్రధాన మార్గమైన బాబ్ అల్-మందేబ్ జలసంధి. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఇంధన, చమురు వాణిజ్యంలో 35 శాతానికి పైగా ఈ రెండు మార్గాలపైనే ఆధారపడి ఉండటంతో, నేరుగా తనకు మద్దతిచ్చే వర్గాల ద్వారా పరోక్షంగా ఈ మార్గాలను ఇరాన్ నియంత్రించగలగడం అణుబాంబు కలిగి ఉన్నంత వ్యూహాత్మక శక్తినిస్తుందని లండన్‌కు చెందిన చాథమ్ హౌస్ పరిశోధకుడు ఫరియా అల్-ముస్లిమీ అభిప్రాయపడ్డారు. ఎర్రసముద్రంలోని పెరిమ్‌వంటి కీలక దీవులను కూడా హూతీలు స్వాధీనం చేసుకుంటే, అంతర్జాతీయ నౌకా రవాణాకు ఆటంకం కలిగించే వారి సామర్థ్యం మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఇజ్రాయెల్-గాజా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచే హూతీలు ఎర్రసముద్రంలో ప్రయాణించే నౌకలపై క్షిపణులు, డ్రోన్లు, చిన్నస్థాయి పడవల ద్వారా దాడులు చేస్తూ, ఆ ప్రాంతాలను భౌతికంగా స్వాధీనం చేసుకోకుండానే నౌకా రవాణాను నియంత్రించగలిగారని యెమెన్ ఎక్స్‌పర్ట్ ఐయోనా క్రెయిగ్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో సంబంధమున్న నౌకలనే లక్ష్యంగా చేసుకుంటున్నామని హూతీలు చెబుతున్నా, గతంలో నార్వే జెండాతో ప్రయాణించిన చమురు ట్యాంకర్‌పై కూడా దాడి జరగడం, ఈ ప్రకటనలో వాస్తవికత ఎంత అనే సందేహాలను లేవనెత్తుతోంది. అయితే 2025లో అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ రఫ్ రైడర్' వంటి భారీ ప్రతిదాడులను మళ్లీ ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో హూతీలు అన్ని నౌకలపైనా విచక్షణారహితంగా దాడి చేయకపోవచ్చని క్రెయిగ్ అభిప్రాయపడ్డారు.

ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో అమెరికా పాత్ర అనిశ్చితంగా మారింది. ఇరాన్‌తో ఇప్పటికే సాగుతున్న యుద్ధానికి అమెరికా ప్రజల్లో పెద్దగా మద్దతులేని తరుణంలో, చమురు ధరలు మళ్లీ పెరుగుతున్న సమయంలో మరో కొత్త యుద్ధరంగాన్ని తెరవడం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రాజకీయంగా లాభదాయకం కాదు. నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అవకాశాలపైనా ఇది ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలంటూ సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ చేసిన విజ్ఞప్తులకు అమెరికా నుంచి ఇప్పటివరకు స్పష్టమైన స్పందన రాలేదు. యెమెన్‌లో పెరుగుతున్న ఘర్షణపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, సౌదీ అరేబియాకు మద్దతును పెంచేందుకు ప్రయత్నిస్తూ, ప్రత్యక్ష సైనిక జోక్యానికి మాత్రం దూరంగా ఉండాలని అమెరికా భావిస్తున్నట్టు కనిపిస్తోంది. అయితే సౌదీ అరేబియాను భయపెడుతున్నది కేవలం బాబ్ అల్-మందేబ్‌కు ఎదురయ్యే ముప్పు మాత్రమే కాదు, హార్ముజ్ జలసంధి మూతపడిన తర్వాత చమురు ఎగుమతికి కీలక ప్రత్యామ్నాయంగా మారిన సౌదీ ఈస్ట్-వెస్ట్ చమురు పైప్‌లైన్‌పై కూడా హూతీలు క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసినట్టు ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంవల్ల ఇప్పటికే ఏర్పడిన ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకే ఈ దాడి జరిగినట్టు కనిపిస్తోంది. ఇరాన్ నేరుగా ఆదేశాలివ్వకపోయినా, దీనివల్ల లాభపడేది మాత్రం ఇరానే. 2022లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ తర్వాత ఇంతటి తీవ్రస్థాయి ఘర్షణలు చోటుచేసుకోవడం ఇదే తొలిసారని లండన్‌కు చెందిన విశ్లేషకుడు బరా షైబాన్ పేర్కొన్నారు. జూలైలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హూతీ ప్రతినిధి బృందం హాజరైన తర్వాతే ఈ పరిణామాలు వేగం పుంజుకున్నాయన్నది తాజా విశ్లేషణ. యెమెన్ మళ్లీ పూర్తిస్థాయి యుద్ధం అంచుకు చేరుకుంటుండగా, సౌదీ అరేబియా తన ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఎర్రసముద్ర మార్గాన్ని కాపాడుకోవడంపై తీవ్ర ఆందోళన చెందుతోంది. ట్రంప్ ఈ ఘర్షణలో జోక్యం చేసుకోవడానికి ఇష్టపడకపోవడంతో ఇరాన్-అమెరికా ఘర్షణ మరింత సంక్లిష్టమైన, ప్రమాదకరమైన కొత్త దశలోకి ప్రవేశించింది. అయితే ఈ భౌగోళిక-రాజకీయ పోరులో అత్యధికంగా నష్టపోతున్నది మాత్రం సామాన్య యెమెన్ ప్రజలే. 12 ఏళ్లుగా సాగుతున్న అంతర్యుద్ధంతో ఇప్పటికే నిరాశ్రయులైన, బాంబు దాడులకు గురైన, ఆకలితో అలమటిస్తున్న, పేదరికంలో మగ్గుతున్న లక్షలాది మంది జీవితాలను ఈ తాజా పరిణామాలు మరింత దుర్భరం చేసే ప్రమాదం కనిపిస్తోంది. ■



బాధ వచ్చినప్పుడు కొందరు కుంగిపోతారు.. మరికొందరు అదే బాధను తమ ఎదుగుదలకు మెట్టుగా మార్చుకుంటారు. ఉదాహరణకు, పరీక్షలో విఫలమైన విద్యార్థి ఆ ఓటమినే జీవితాంతం మోస్తే ముందుకు సాగలేడు. కానీ తన తప్పులను గుర్తించి, మరింత కష్టపడి తిరిగి ప్రయత్నిస్తే అదే వైఫల్యం విజయానికి బాటవుతుంది. మనసుకు గాయం కావడం కొన్ని క్షణాలే.. కానీ దాన్ని బాధగా మోసుకెళ్లాలా, అనుభవంగా మార్చుకోవాలా, బలంగా నిలబడాలా అనేది పూర్తిగా మన చేతుల్లోనే ఉంటుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# ట్రంప్ ఆకారంలో ఎక్స్‌టసీ మాత్రలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖ ఆకారంలో తయారైన ఎక్స్‌టసీ మాత్రలు ఇప్పుడు ఆందోళనకు కారణమవుతున్నాయి. వీటిలో ప్రాణాంతక ప్రభావాలకు దారితీసే నెమ్మదిగా పనిచేసే మత్తు పదార్థం ఉన్నట్టు నెదర్లాండ్స్‌కు చెందిన ట్రింబోస్ ఇన్‌స్టిట్యూట్ హెచ్చరించింది. ప్రభావం ఆలస్యంగా కనిపించడంతో వినియోగదారులు మరో మాత్ర తీసుకునే ప్రమాదం ఉందని, ఫలితంగా మోతాదు మించి తీసుకుని ప్రాణాపాయానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపింది.

# జూనియర్ హాకీ ఆసియా కప్..
# భారత్‌కు డబుల్ ధమాకా

**మోఖీ (చైనా):** ఆసియా కప్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టు, పురుషుల జట్టు స్వర్ణాలు సాధించాయి. చైనాతో జరిగిన ఫైనల్‌లో భారత మహిళా జట్టు 1-0 తేడాతో గెలుపొందింది. మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్‌ను భారత క్రీడాకారిణి సానిక చంద్రకాంత్ మనే 17వ నిమిషంలో సాధించింది. భారత మహిళల జట్టు ఈ కప్‌ను గెలుచుకోవడం ఇది వరుసగా మూడోసారి కావడం విశేషం. 2023 ఎడిషన్‌లో దక్షిణ కొరియాను ఓడించి తొలి టైటిల్ సాధించిన భారత్.. 2024 ఎడిషన్‌లో చైనాను మట్టికరిపించి రెండోసారి విజేతగా నిలిచింది. తాజాగా ఆసియా కప్ ఛాంపియన్‌గా అవతరించిన భారత జట్టు జూనియర్ ప్రపంచ కప్‌లో స్థానాన్ని ఖరారు చేసుకుంది. హ్యాట్రిక్ కొట్టిన భారత అమ్మాయిల బృందానికి హాకీ ఇండియా నగదు ప్రోత్సాహం ప్రకటించింది. జట్టులోని ప్రతి క్రీడాకారిణికి రూ.3 లక్షలు, సహాయక సిబ్బందిలో ప్రతి ఒక్కరికీ రూ.1.5 లక్షల నగదు బహుమతి ఇస్తామని తెలిపింది.



అబ్బాయిలు కూడా

ఈ టోర్నమెంట్‌లో పురుషుల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో భారత్ 4-1 తేడాతో కొరియాను ఓడించింది. భారత్ తరఫున అజిత్ యాదవ్ (9వ నిమిషం), అన్మోల్ (13వ), ప్రభ్‌దీప్‌సింగ్ (21వ), అషు మౌర్య (50వ) గోల్స్ చేశారు. కొరియా ఓటమి ఖాయమైన తర్వాత 54వ నిమిషంలో ఆ జట్టు ప్లేయర్ లీ మిన్-హ్యోక్ గోల్ చేశాడు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది వరుసగా నాలుగో టైటిల్ కావడం విశేషం. గత మూడు ఎడిషన్లలో (2015, 2023, 2024) పాకిస్థాన్ ప్రత్యర్థి కాగా.. మూడుసార్లు చిరకాల ప్రత్యర్థిని భారత్ చిత్తుగా ఓడించి ఛాంపియన్‌గా నిలిచింది. అబ్బాయిల బృందానికి కూడా హాకీ ఇండియా జట్టులోని ప్రతి క్రీడాకారిణికి రూ.3 లక్షలు, సహాయక సిబ్బందిలో ప్రతి ఒక్కరికీ రూ.1.5 లక్షల నగదు బహుమతి ప్రకటించింది.

## స్పోర్ట్స్

## జూనియర్లు జయహో.. పసిడితో గర్జించిన అబ్బాయిలు, అమ్మాయిలు..!




ఏహెచ్ఎఫ్ జూనియర్ ఆసియా కప్‌లో భారత్ పంజా విసిరింది. టాప్ గేర్‌లో ఆడిన టీమిండియా ఏకంగా రెండు విభాగాల్లోనూ పసిడితో మెరిసింది. ఆదివారం ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో దక్షిణ కొరియాపై అబ్బాయిల జట్టు జయభేరి మోగించగా.. ఉత్కంఠ పోరులో చైనాకు చెక్ పెట్టారు అమ్మాయిలు. దాంతో.. స్వల్ప వ్యవధిలోనే పోడియం మీద మువ్వన్నెల జెండా రెండుసార్లు రెపరెపలాడింది. అంతేకాదు ఎఫ్ఐహెచ్ జూనియర్ వరల్డ్‌కప్ బెర్తును సొంతం చేసుకుంది. హాకీలో సీనియర్ జట్లు విఫలమైనా.. జూనియర్ టీమ్ మాత్రం పసిడి పతకం కొల్లగొట్టింది. ఆసియా కప్‌లో పురుషుల, మహిళల జట్లు అద్భుత విజయంతో స్వర్ణం సాధించాయి. ఆదివారం టైటిల్ పోరులో అబ్బాయిల బృందం చేతిలో దక్షిణ కొరియా కంగుతినగా.. అమ్మాయిల ధాటికి చైనా తోకముడిచింది. కొరియాతో ఫైనల్లో 4-1తో విజయం సాధించింది పురుషుల జట్టు. ఆట మొదలైన 9వ నిమిషంలోనే అజీత్ యాదవ్ గోల్ చేయగా.. అన్మోల్ ఎక్కా 13వ నిమిషంలో, ప్రభ్‌దీప్ సింగ్ గోల్‌తో తొలి అర్ధ భాగంలోనే భారత్ పైచేయి సాధించింది. రెండో అర్ధ భాగంలో కొరియా ఖాతా తెరిచినా అశూ మౌర్యలు చెరొక గోల్‌తో టీమిండియా స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందింది. తద్వారా ఎఫ్ఐహెచ్ జూనియర్ వరల్డ్‌కప్ బెర్తు పట్టేసింది.

దుర్భేధ్యమైన డిఫెన్స్‌తో

టైటిల్ పోరులో అమ్మాయిల జట్టు సైతం గొప్పగా ఆడి చైనాను నిలువరించింది. దుర్భేధ్యమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థిని అడ్డుకున్న టీమిండియా 1-0తో గోల్డ్ మెడల్ కొల్లగొట్టింది. ఈ విజయంతో ఐదో ఎఫ్ఐహెచ్ జూనియర్ వరల్డ్‌కప్ పోటీలకు అర్హత సాధించింది టీమిండియా. సంచలన ప్రదర్శనతో ఆసియా కప్ గెలుపొందిన మహిళల జట్టుకు హాకీ ఇండియా రివార్డులు ప్రకటించింది. స్క్వాడ్‌లోని ప్లేయర్లకు రూ.3 లక్షలు, కోచింగ్ సిబ్బందికి తలా రూ.1.5 లక్షల నగదు బహుమతి ప్రకటించింది.

## టీమిండియాలోకి ఎవరూ ఊహించని ప్లేయర్లు?

ఈ నెలఖారులో వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న వన్డే, టీ20 సిరీస్‌కు భారత జట్లను బీసీసీఐ సెలక్షన్ కమిటీ సోమవారం ప్రకటించే అవకాశముంది. అయితే మహారాష్ట్ర బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ తిరిగి వన్డే జట్టులోకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆసియా క్రీడల కోసం జపాన్‌కు వెళ్లనుండడంతో అతడి స్ధానంలో గైక్వాడ్‌ను ఎంపిక చేయాలని సెలక్టర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్-వెస్టిండీస్ మధ్య వన్డే సిరీస్ సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభం కానుండగా.. అదే సమయంలో భారత మరో జట్టు ఆసియా క్రీడల్లో బిజీగా ఉండనుంది. ఒకే సమయంలో రెండు వేర్వేరు టోర్నీలు జరుగుతుండటంతో జట్ల ఎంపిక సెలక్టర్లకు పెద్ద సవాలుగా మారింది. శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ వంటి కీలక ప్లేయర్లు ఏషియన్ గేమ్స్ కారణంగా విండీస్‌తో వన్డేలకు అందుబాటులో ఉండకపోవచ్చు. ఒకవేళ బుమ్రా ఆసియా క్రీడల్లో పాల్గొనకపోతే కచ్చితంగా విండీస్ సిరీస్‌లో ఆడుతాడు. రుతురాజ్ చివరగా డిసెంబర్ 2025లో దక్షిణాఫ్రికాపై భారత తరఫున ఆడాడు. ఈ మ్యాచ్‌లో సెంచరీ సాధించినప్పటికి, జట్టులో పోటీ కారణంగా అతడు చోటు కోల్పోయాడు.



సీనియర్ జట్టులో లేకపోయినా భారత 'ఎ' జట్టులో మాత్రం రెగ్యులర్ సభ్యునిగా రుతురాజ్ ఉన్నాడు. ఆస్ట్రేలియా 'ఎ'తో జరగనున్న అనాధికరిక వన్డే సిరీస్‌లో ఇండియా-ఎ కెప్టెన్‌గా గైక్వాడ్ వ్యవహరించనున్నాడు. ఇక గైక్వాడ్‌తో పాటు స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ కూడా తిరిగి వన్డే జట్టులోకి రానున్నట్లు సమాచారం. కేఎల్ రాహుల్‌కు బ్యాకప్‌గా అతడిని తీసుకోవాలని సెలక్టర్లు యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ఆసియాకప్, విండీస్ వన్డే షెడ్యూల్

సెప్టెంబర్ 27: విండీస్‌తో తొలి వన్డే

సెప్టెంబర్ 28: ఆసియా క్రీడల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్


సెప్టెంబర్ 30: గౌహతిలో విండీస్‌తో రెండో వన్డే

అక్టోబర్ 1: ఆసియా క్రీడల సెమీ-ఫైనల్

అక్టోబర్ 3: విండీస్‌తో మూడో వన్డే.. అదే రోజు ఆసియా క్రీడల స్వర్ణ, కాంస్య పతకాల మ్యాచ్‌లు



# గ్లామర్ వెనుక అసలైన కష్టం.. తెర వెనుక ఫ్యాక్ట్ బయటపెట్టిన రాశి సింగ్



చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తిని పెంచుకున్న ప్రముఖ బ్యూటీ రాశి సింగ్ కి.. 14 ఏళ్ల వయసులోనే ఒక కమర్షియల్ యాడ్ లో అవకాశం వచ్చినా. వ్యక్తిగత కారణాల వల్ల వదులుకుంది. చదువు పూర్తి చేసుకున్న ఈమె తొలిసారి ఇండిగో ఎయిర్ లైన్స్ లో ఎయిర్ హోస్టేస్ గా కెరియర్ ప్రారంభించింది. ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉన్న సమయంలోనే 2019లో జెమ్ అనే తెలుగు చిత్రంతో నటిగా అరంగేట్రం చేసింది. ఆ తర్వాత పోస్టర్, ప్రసన్న వదనం, బ్లైండ్ స్పాట్ , సంతాన ప్రాప్తిరస్తు, ట్రాన్సర్ త్రిమూర్తులు ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ ఏవి కూడా ఈమెకు అనుకునేంత స్థాయిలో గుర్తింపును అందివ్వలేదు.

**రంభాషీగా రాశి సింగ్..**

కానీ రీసెంట్గా అల్లరి నరేష్ హీరోగా వచ్చిన రంభ ఊర్వశి మేనక చిత్రంలో రంభ పాత్రతో అందరి దృష్టిని తన వైపు తిప్పుకుంది రాశి సింగ్. ఈ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోకపోయినా.. ఇందులో ఆమె నటన అందరి దృష్టిని ఆకట్టుకుంది. ముఖ్యంగా ఆమె గ్లామర్ కుర్రకారుకు మంచి ట్రీట్ ఇచ్చింది. అంతేకాదు రంభ పాత్రకు సంబంధించిన గ్లామర్ లుక్ ను ఎప్పటికప్పుడు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా షేర్ చేస్తూ.. సినిమాపై అంచనాలు పెంచేసింది. సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోకపోయినా రంభ పాత్రలో రాశి సింగ్ మాత్రం మంచి పేరు దక్కించుకుంది.

**గ్లామర్ వెనుక అసలైన కష్టం..**

ముఖ్యంగా ఈ సినిమాలో రంభ పాత్రతో గ్లామర్ హంగులతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె ఇంత అందంగా కనిపించడం వెనుక తాను పడ్డ కష్టాన్ని అభిమానులతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. గ్లామర్ వెనుక తాను పడ్డ కష్టం ఇదే అంటూ ఆ ఫోటోలను క్యాప్షన్ కూడా జోడించింది. రాశి సింగ్ ఈ ఫోటోలను షేర్ చేస్తూ.." మీరు తెరపై చూసేది అందం, ఆకర్షణ మాత్రమే. కానీ దానిని నిలబెట్టుకోవడానికి పడే కష్టం మీకు కనిపించదు. సరైన ఆహారం తీసుకోవడం, నా శరీరాన్ని, చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం.. ఫిట్గా ఉండడం, చల్లని రాత్రులలో, అర్ధరాత్రి వేళల్లో షూటింగ్ చేయడం, ఒళ్ళు నొప్పులు భరించడం.. అయినా కూడా ప్రదర్శన ఇవ్వడానికి తగినంత శక్తిని కలిగి ఉండడం.. అలాగే నన్ను రంబాషి అని పిలిచిన వాళ్లందరూ గెలిచారు. నేను ఆ పేరు నే ఉంచుకుంటాను. ఈ లుక్కును, నన్ను హ్యాండిల్ చేసిన నా టీం కి ప్రత్యేక ధన్యవాదాలు" అంటూ తెర వెనుక ఆ పాత్ర కోసం ఆమె పడ్డ కష్టాన్ని అభిమానులతో పంచుకుంది.

**తెర వెనుక కష్టాలను పంచుకున్న రాశి సింగ్..**

ముఖ్యంగా రంభ పాత్ర కోసం ఆమె రెడీ అవుతున్న ఫోటోలను అలాగే నిప్పులతో చేతులను కాచుకుంటున్నట్టు ఇలా కొన్ని ఫోటోలను ఆమె షేర్ చేశారు . ఏదేమైనా సెలబ్రిటీలు మనకు వినోదాన్ని పంచుతున్నారు అంటే.. తెర వెనుక వారు పడే కష్టం ఎలా ఉంటుందో చెప్పడం వర్ణనాతీతం. ప్రస్తుతం రాశి సింగ్ షేర్ చేసిన ఫోటోలు, పంచుకున్న క్యాప్షన్ అభిమానులలో, నెటిజన్స్ లో సెలబ్రిటీస్ పై మరింత గౌరవాన్ని పెంచుతున్నాయి.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com